www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 128 | | 30-10-2026 | | శుక్రవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

పోలీసుల లాఠీలకు భయపడొద్దు

- నవంబర్1న ర్యాలీకి తరలిరండి
- ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు
- ఇండీ కూటమి నవంబర్ 1న తలపెట్టిన చలో ఢిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి
- తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు
- దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దాం

వికసిత్ భారత్‌కు సమష్టి కృషి

- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం
- సీఎం రేవంత్‌రెడ్డి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ఆర్ఆర్ఆర్‌తో హైదరాబాద్‌కు కొత్త ఊపు
- పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం
- ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ సత్తా

హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్రం నిర్దేశించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుందని, అందులో తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల వాటాను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. దిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలం గాణ గ్లోబల్ సమ్మిట్ సన్నాహక కార్యక్రమంలో ఆయన పెట్టుబడిదా రులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రంతో కలిసి ముందుకు సాగుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి - మిగతా3లో

టీ వృథాపై ఫిర్యాదు చేయండి

- 'పానీ' యాప్‌ను ప్రారంభించిన జలమండలి
- నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త కార్యక్రమం
- ఫొటోలు, వీడియోలతో ఫిర్యాదు చేసే అవకాశం
- నీటిని వృథా చేస్తే జరిమానాలు
- 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకోవచ్చు

హైదరాబాద్

నగరంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు హైదరాబాద్ జలమండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రజలను నీటి సంరక్షణలో భాగస్వాములను చేస్తూ 'పానీ' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో కలిసి గురువారం జలమండలి కార్యాలయంలో ఈ యాప్‌ను ఆవిష్కరించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు తాగునీటి ప్రాధాన్యంపై - మిగతా3లో

డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

- బ్యాంకులే నష్టపరిహారం చెల్లించాలి
- అసాధారణ లావాదేవీలపై నిఘా
- తగ్గిన డిజిటల్ అరెస్ట్ కేసులు
- విద్యావంతులూ మోసపోతున్నారు
- డిజిటల్ అరెస్టులపై సీజేఐ ఆగ్రహం

మహువా మొయిత్రా పిటిషన్ కొట్టివేత

- సెబీకి ఆదేశాలు ఇవ్వలేమన్న సుప్రీం
- కొత్త నియంత్రణ విధానం సృష్టించలేం
- పెట్టుబడిదారుల వివరాలపై వాదనలు
- పారదర్శకతపై పిటిషనర్ ఆందోళన

ఎరుపెక్కిన ఆకాశం..



- ఛత్తీస్‌గఢ్‌లో పలుచోట్ల రక్తవర్ణంలోకి మారిన ఆకాశం
- అర్నబ్ తుపాను ప్రభావంతోనే ఈ పరిస్థితి అని నిపుణుల అంచనా
- 'స్ట్రేంజర్ థింగ్స్' సిరీస్‌తో పోలుస్తూ నెటిజన్ల వైరల్ పోస్టులు
- ఇనుము అధికంగా ఉండే ధూళి కణాలే దీనికి కారణమని వెల్లడి
- ఏపీ తీరాన్ని తాకిన అర్నబ్ తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వైనం

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

- ఎల్‌నినోపై కొత్త అంచనా!
- మార్చిలోనే ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాల అంచనా
- నైజీరియాలో 56 వేల మరణాల ప్రమాదం ఉందన్న క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్
- ఎల్‌నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం

రైతుల ఆత్మహత్యలు పట్టవా?

- రాష్ట్రం కరువులో ఉంటే.. మూసీ సుందరీకరణ ఎందుకు?
- ప్రజల గొంతు నొక్కితే అదేనా పబ్లిక్ హియరింగ్?
- మూసీ ప్రాజెక్టు డీపీఆర్ ఏది?
- 10 టీఎంసీల నీటిని మూసీకి తరలించడంపై ఆగ్రహం
- మూసీ పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీకి కుట్ర
- తాగునీటికి కటకట.. సుందరీకరణకు ప్రాధాన్యమా?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం

550 ఎకరాలు ప్రభుత్వానివే

- మియాపూర్ భూములపై సుప్రీం తీర్పు
- 23 ఏళ్ల వివాదానికి తెర
- ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లు కొట్టివేత
- ప్రభుత్వానికి అనుకూలంగా ధర్మాసనం తీర్పు

హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101కు సంబంధిం చిన భూ వివాదంలో సుప్రీంకోర్టు కీలకతీర్పు వెలువరిం చింది. సుమారు 550 ఎకరాలకిపైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. దీంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై - మిగతా3లో

రబీ సాగుపై ఎల్‌నినో పంజా

- దేశవ్యాప్తంగా 59 శాతం పడిపోయిన గోధుమల సాగు
- ఆందోళనలో రైతులు!
- ఎల్‌నినో ఎఫెక్ట్ రబీ పంటల సాగుపైనా పడింది
- దేశంలో ఈ రబీ పంటల సాగు విస్తీర్ణం 28.26 లక్షల హెక్టార్ల నుంచి 18.02 లక్షల హెక్టార్లకు తగ్గింది

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం
- రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

ఉద్యమ కెరటం
శుక్రవారం
30 అక్టోబర్ 2026

రైతుల ఆత్మహత్యలు పట్టవా?

హైదరాబాద్: రాష్ట్రం కరువు పరిస్థితులను ఎదుర్కొంటుంటే మూసీ సుందరీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజల అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం లేకుండా పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు వివరాలను బహిర్గతం చేయకుండా, ప్రజాభిప్రాయ సేకరణను నామమాత్రంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజల గొంతు నొక్కితే ఎలా?

ప్రజల గొంతు నొక్కుతూ పబ్లిక్ హియరింగ్ నిర్వహించడం ఏ విధమైన ప్రజాభిప్రాయ సేకరణ అని కేటీఆర్ ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ పాలిత తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను గమనించాలని సూచించారు. ప్రజలకు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు ముసుగులో వేలాది ఎకరాల భూముల విషయంలో అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నారని అధికారుల నుంచి సమాచారం అందుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అడిగినా ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు.

కరువును పట్టించుకోరా?

రాష్ట్రంలో రైతులు కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో వారం రోజుల్లో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొంటూ, రైతుల కన్నీళ్లు తుడవడంపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదని ఆరోపించారు. పంటలు ఎండిపోవడం, పశువులకు మేత కొరత ఏర్పడటం వంటి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయని, రోజుకు సుమారు ఏడు వేల ట్యాంకర్ల నీటిని బుక్ చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మల్లన్నసాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని తీసుకొచ్చి మూసీ సుందరీకరణకు వినియోగిస్తామని చెప్పడం సమంజసం కాదని విమర్శించారు. సాగు, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చిన తర్వాతే సుందరీకరణ వంటి కార్యక్రమాలపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

డీపీఆర్ ఎందుకు బయటపెట్టడం లేదు?

మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలోనే రూ.4 వేల కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీలు) నిర్మాణం చేపట్టామని, మొత్తం ప్రాజెక్టును సుమారు రూ.16 వేల కోట్లతో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తీసుకుంటున్నట్లు చెబుతోందని, అయినప్పటికీ ప్రాజెక్టు వివరాలను వెల్లడించడం లేదని విమర్శించారు. మూసీ ప్రాజెక్టుకు నిధులు ఎక్కడి నుంచి సమకూరుస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. మూసీ సుందరీకరణకు మాత్రం భారీగా ఖర్చు చేసేందుకు ఎలా సిద్ధమవుతోందని ప్రశ్నించారు.

మేడిగడ్డపై చర్యలేవీ?

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. బ్యారేజీకి సంబంధించిన సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. బ్యారేజీని తిరిగి వినియోగంలోకి తీసుకురావడం తోపాటు కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. రాష్ట్రంలో నీటి సమస్యలు, రైతుల ఇబ్బందులు, సాగునీటి అవసరాల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ మూసీ ప్రాజెక్టు వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని, ప్రజాభిప్రాయ సేకరణను నిబంధనల ప్రకారం నిర్వహించాలని కోరారు.

చామంతి పూలతో లాభాల బాట..

నిజామాబాద్ : మారుతున్న కాలానికి అనుగుణంగా, సంప్రదాయ పంటల సాగుతో నష్టాలను చవిచూస్తున్న రైతులు ప్రత్యామ్నాయ, లాభసాటి పంటల వైపు మళ్లుతున్నారు. ఈ కోవలోనే అనంతపురం జిల్లా నార్పల మండలం వెంకటాం గ్రామానికి చెందిన రైతు రఫీ చామంతి పూల సాగులో అనూహ్య విజయం సాధిస్తున్నారు. మార్కెట్ అవసరాలను, పండగల డిమాండ్‌ను అర్థం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. రైతు రఫీ తనకున్న ఆరు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని రెండు ఎకరాల చొప్పున మూడు భాగాలుగా విభజించారు. ప్రతి విభాగంలో విడతల వారీగా వివిధ రకాల చామంతి పూలను నాటారు. సాధారణంగా చామంతి సాగును జూన్-జులై నెలల్లో ప్రారంభిస్తారు. దీనివల్ల శీతాకాలంలో, కార్తీక మాసం, పెళ్లిళ్ల సీజన్‌లో అధిక దిగుబడులు వస్తాయి. అయితే రఫీ దసరా, దీపావళి, సంక్రాంతి వంటి ప్రధాన పండగల సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని ముందుగానే మొక్కలు నాటారు. దీనివల్ల పండగల సమయంలో పూలకు అధిక గిరాకీ, మంచి ధర లభిస్తున్నాయి.ప్రస్తుతం ఆయన పొలంలో బుల్లెట్ (తెలుపు, పసుపు రకాలు), ఐశ్వర్య, ముస్కిన్ వైట్, పేపర్ ఎల్లో, పేపర్ వైట్, పూర్ణిమా ఎల్లో, పూర్ణిమా వైట్ వంటి వివిధ రకాల చామంతులు సాగవుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుండి ఒక్కో మొక్కను రూ. 1.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా, నాటడానికి కలిపి రూ. 2 ఖర్చు అయ్యిందని రఫీ తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు కూలీలను పెట్టి మొక్కలను నాటించారు. మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు దూరం ఉండేలా జాగ్రత్త

పడ్డారు. మొక్కలు నాటిన ఐదు నెలలకు దిగుబడి ప్రారంభమవుతుంది. సాగులో భాగంగా ఎరువులు, పురుగుమందుల వాడకంలో రఫీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొదట డీఏపీ, ఆ తర్వాత ట్రిపుల్ 8, ట్రిపుల్ 28 వంటి ఎరువులను ఉపయోగిస్తారు. డ్రిప్ ద్వారా 13-45-13, 12-0-61 వంటి వాటిని అందిస్తూ, మధ్యమధ్యలో న్యూట్రియెంట్స్, ఫార్ములా 6, హ్యూమిక్ పౌడర్ వంటి వాటిని కూడా వాడుతున్నారు. చామంతి పూలకు సాధారణంగా మొగ్గ వచ్చే వరకు తెగుళ్లు పెద్దగా రావు, కానీ మొగ్గ వచ్చిన తర్వాత పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి నివారణకు అవసరమైన మందులను వాడుతున్నామని రఫీ వివరించారు.చామంతి పూల కోత సుమారు రెండు నెలల పాటు నిరంతరం కొనసాగుతుంది, ఆ తర్వాత మూడో నెలలో దిగుబడి కాస్త తగ్గుతుంది. మొదటి కోతలోనే రెండు ఎకరాల నుంచి ఒక టన్ను పూలు వచ్చాయని, కిలో రూ. 200 చొప్పున రూ. 2 లక్షల ఆదాయం వచ్చిందని రఫీ తెలిపారు. మొత్తం పెట్టుబడి మొక్కలు నాటినప్పటి నుంచి రూ. 2.25 లక్షలు అయ్యిందని, మొదటి కోతతో పెట్టుబడి వెనక్కి వచ్చి, రెండో కోత నుంచి లాభాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ విషయానికొస్తే, ఉదయం కోసిన పూలను అనంతపురం మార్కెట్‌కు, సాయంత్రం కోసిన పూలను బెంగళూరు, చెన్నై, మైసూరు వంటి పెద్ద నగరాలకు పంపిస్తారు. వ్యాపారులు స్వయంగా పొలానికి వచ్చి పూలను కొనుగోలు చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. నాణ్యత ఆధారంగా ధరలు మారుతాయని, మొదటి నాణ్యత పూలకు రూ. 275, రెండో నాణ్యతకు రూ. 150, మూడో నాణ్యతకు రూ. 100 వరకు ధర లభిస్తుందని వివరించారు. ఏ పంట అయినా సరే, నాణ్యత ఉంటేనే లాభాలు వస్తాయని, లేకపోతే పంట వ్యర్థమని రఫీ స్పష్టం చేస్తున్నారు. ఎప్పుడూ ఒకే పంట వేయకుండా, వినూత్నంగా ఆలోచిస్తూ, మార్కెట్‌కు అనుగుణంగా పంటలను ఎంచుకుంటే లాభాలు వాటంతట అవే వస్తాయని రైతు రఫీ తన అనుభవంతో నిరూపిస్తున్నారు.

మెట్రో రెండో దశకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ : భాగ్యనగర ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నగరం నలుమూలలా శరవేగంగా విస్తరిస్తున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి కనెక్టివిటీని తీసుకురావడమే లక్ష్యంగా మొత్తం రూ. 24,269 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ విస్తరణ ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఆమోదించింది. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 50:50 జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ను కేంద్రం క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయడంతో నగరవాసుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది.ఈ రెండో దశ విస్తరణలో భాగంగా మొత్తం 76.4 కిలోమీటర్ల మేర 5 ప్రధాన కారిడార్లను నిర్మించనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం అనుసంధానమే ప్రధాన లక్ష్యంగా రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 29 కిలోమీటర్ల కారిడార్-4 అతిపెద్ద మార్గంగా రూపుదిద్దుకోనుంది. దీంతో పాటు పాతబస్తీ కనెక్టివిటీని పెంచుతూ ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు , మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్లు , ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్లు , నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్ వరకు 19.4 కిలోమీటర్ల మేర మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ రూట్లతో

నగరంలోని ఐటీ కారిడార్లు, పారిశ్రామిక వాడలు, పాతబస్తీ , శివారు ప్రాంతాలకు నేరుగా మెట్రో అనుసంధానం ఏర్పడనుంది.ప్రాజెక్టు ఆర్థిక రూపకల్పనను పరిశీలిస్తే.. మొత్తం రూ. 24,269 కోట్ల వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 18 శాతం రూ. 4,368 కోట్లు , తెలంగాణ ప్రభుత్వం 33 శాతం రూ. 8,008 కోట్లు భరించనున్నాయి. మిగిలిన 48 శాతం నిధులను రూ. 11,653 కోట్లు జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ , ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి దీర్ఘకాలిక రుణాల రూపంలో సమీకరించనున్నారు. రెండో దశను పూర్తిగా ప్రభుత్వ సంయుక్త యాజమాన్యంలో నిర్మించాలని నిర్ణయించడం ద్వారా పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు పటిష్టమైన కార్యాచరణను సిద్ధం చేశారు.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రాబోయే నాలుగేళ్లలో, అంటే 2029 నాటికి పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువుగా నిర్దేశించుకున్నారు. ఫేజ్-2 అందుబాటులోకి వస్తే హైదరాబాద్ మెట్రో నెట్‌వర్క్ దాదాపు 145 కిలోమీటర్లకు పైగా విస్తరించి, దేశంలోనే రెండో అతిపెద్ద మెట్రో వ్యవస్థగా మరింత పటిష్టపడనుంది.

వికసిత్ భారత్‌కు సమష్టి కృషి

-మొదటిపేజీ తరువాయి

కేంద్రం సహకరిస్తోందని, రెండు కొత్త విమానాశ్రయాలకు అనుమతులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు భారత్ సిద్ధమవుతోందని అన్నారు.

ఆర్ఆర్ఆర్‌తో కొత్త అవకాశాలు

హైదరాబాద్‌లో ఏరోస్పేస్ రంగ అభివృద్ధికి దివంగత రాజీవ్‌గాంధీ పునాది వేశారని సీఎం గుర్తుచేశారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు దివంగత ప్రధాని పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టూ ప్రతిపాదిత ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం పూర్తయితే నగర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వికసిత్ భారత్‌కు సమష్టి కృషి

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. తెలంగాణ నిర్దేశించుకున్న మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశ ఎగుమతులు పెరిగి ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు.

పెట్టుబడులకు అనుకూల రాష్ట్రం

పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందంజలో ఉందని భారత్ బయోటెక్ సీఎండీ సుచిత్ర ఎల్లా అన్నారు. పెట్టుబడుల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు పొందిందని, జీనోమ్ వ్యాలీ నుంచి కోవాగ్జిన్ వంటి టీకా అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల తయారీ, ఎలక్ట్రానిక్స్, విమాన విడిభాగాల తయారీలో హైదరాబాద్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డిసెంబర్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ రాష్ట్రంలో పెట్టుబడులకు కీలక వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

550 ఎకరాలు ప్రభుత్వానివే

-మొదటిపేజీ తరువాయి

సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న న్యాయ వివాదానికి ముగింపు లభించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వేనంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటల ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఆ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ కేసుల్లో 1997లో ప్రత్యేక న్యాయస్థానం, 2003లో హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పుఇచ్చింది. ఆ తీర్పును సవాల్‌చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. దాదాపు 23 ఏళ్లుగా ఈ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేస్తూ జస్టిస్ సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆ భూములను జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నిషా, ఇతరుల నుంచి చట్టబద్ధంగా పొందామని తమ పేరిట ఉన్న జీపీఏ, సనద్ హక్కులకు ఆటంకం కలగకుండా చూడాలని పిటిషన్‌దారులు కోరారు. రిజిస్టర్డ్ పత్రాలని రద్దు చేసే అధికారం తహసీల్దార్‌కు లేదని వాదించారు.

23 ఏళ్ల భూ వివాదానికి తెర

ప్రభుత్వ పక్షాన వాదించిన సీనియర్ న్యాయవాది శ్రీ వైద్యనాథన్ మియాపూర్ భూములు సర్కారుకే చెందుతాయని స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, సేత్వార్, క్లాసర్ రిజిస్టర్ గత న్యాయస్థానాల తీర్పులను ఆధారాలుగా సమర్పించారు. ప్రైవేట్ వ్యక్తులు హక్కులు కోరుతూ చూపిన రెవెన్యూ ఎంట్రీల్లో అవకతవకలున్నాయని గత న్యాయస్థానాలు గుర్తించిన అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేందుకు కోర్టు అనుమతించబోదని స్పష్టంచేసింది. ఇలాంటి విషయాల్లో కోర్టు మౌనంగా ఉండలేదని పేర్కొంది. ఈ భూముల విషయంలో ప్రభుత్వం చూపిన చొరవని సుప్రీంకోర్టు ప్రశంసించింది. మియాపూర్ భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని వ్యాఖ్యానించారు.

టి వృథాపై ఫిర్యాదు చేయండి

-మొదటిపేజీ తరువాయి

ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. నగరంలో ఎక్కడైనా నీటి వృథా కనిపిస్తే పౌరులు 'పానీ' యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం నీటి వృథాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించారు. ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు జలమండలి అధికారులు వెల్లడించారు. నీటిని దుర్వినియోగం చేసిన వారికి జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.

ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలి

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారీ వర్షాలు కురిసినప్పుడు కూడా నీటిని సద్వినియోగం చేసుకోవడంపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్‌లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నీటిని వృథా చేసే అలవాట్లను మార్చుకొని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపుగా వినియోగించాలని పిలుపునిచ్చారు.

'సేవ్ వాటర్ వాలంటీర్'గా అవకాశం

ప్రజలు 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకొని నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో చురుగ్గా పనిచేసే ఉత్తమ వాలంటీర్‌కు ముఖ్యమంత్రితో బ్రేక్‌ఫాస్ట్ లేదా లంచ్ సమావేశంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

నగరానికి నీటి కొరత

హైదరాబాద్‌కు రోజుకు సుమారు 100 ఎంజీడీల నీటి కొరత ఉందని జలమండలి వివరించింది. వివిధ జలాశయాల నుంచి సుమారు 60 ఎంజీడీల నీటిని సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపింది. దీంతో సరఫరాలో సుమారు 40 ఎంజీడీల కొరత మిగులుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి వృథాను గుర్తిస్తే 'పానీ' యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఒకే రోజు పరీక్షలా...

హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రోడ్లు మరియు భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షల తేదీలు, అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే జూనియర్ ఇంజనీర్ పరీక్షల తేదీలు ఒకే రోజు రావడంతో అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. నవంబర్ 6, 7 తేదీల్లో జరగాల్సిన టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష తేదీలు, నవంబర్ 2 నుంచి 6 వరకు షెడ్యూల్ చేయబడిన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీలతో క్లాష్ అవుతున్నట్లు అభ్యర్థులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఎస్సెస్సీ చైర్మన్‌తో స్వయంగా మాట్లాడి అభ్యర్థుల ఇబ్బందిని పరిష్కరించేందుకు చొరవ చూపారు.ఈ పరీక్షల క్లాష్‌ను పరిష్కరించే క్రమంలో, ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీ నవంబర్ 6, 2026గా కేటాయించబడి, టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష కూడా అదే రోజు రావడం వల్ల నష్టపోతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. నవంబర్ 6వ తేదీన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ (సివిల్) పరీక్షను కలిగి ఉండి, టీజీపీఎస్సీ ఏఈ (సివిల్) పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొన్ని నిర్దిష్ట పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ఎస్సెస్సీ జెఈ హాల్ టికెట్ కాపీ (నవంబర్ 6 తేది ఉన్నది), టీజీపీఎస్సీ ఏఈ నోటిఫికేషన్ అప్లికేషన్ కాపీ మరియు టీజీపీఎస్సీ వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ఐడీలను సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది.ఈ పత్రాలను అక్టోబర్ 30, 2026 సాయంత్రం 5 గంటలలోపు టీజీపీఎస్సీ ఆఫీస్‌లోని హెల్ప్ డెస్క్ ద్వారా లేదా ష్ట్రవశ్రీజూటవబనిఏబిణజూబఇ.ణనీల.తిని మెయిల్ ఐడీకి పంపాలని సూచించారు. అభ్యర్థులు ఏ ఒక్కరు కూడా మంచి అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో పరిశీలన తర్వాత సాధ్యమైనంత వరకు నవంబర్ 7, 2026న టీజీపీఎస్సీ ఏఈ పరీక్షను రాయడానికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు కమిషన్ అధికారికంగా వెల్లడించింది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

ఎరుపెక్కిన ఆకాశం..

ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో ఆకాశం అకస్మాత్తుగా రక్తవర్ణంలోకి మారడం తీవ్ర కలకలం రేపింది. దంతెవాడ, కిరండోల్ వంటి ప్రదేశాల్లో నింగి ఎర్రగా మారిన దృశ్యాలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అర్నబ్ తుపాను కారణంగానే వాతావరణంలో ఈ వింత మార్పు చోటుచేసుకుందని స్థానికులు, నెటిజన్లు అభిప్రాయపడు తున్నారు. అయితే, ఆకాశం ఎర్రగా మారడానికి, తుపానుకు మధ్య ఉన్న సంబంధంపై అధికారికంగా ఎటువంటి ధ్రువీకరణ లేదు. తుపాను సమయంలో బలమైన గాలులు వీచినప్పుడు భారీ మొత్తంలో ధూళి, ఇసుక, ముఖ్యంగా ఇనుము అధికంగా ఉండే ఎర్రమట్టి గాలిలోకి లేస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం.. ఈ ధూళి కణాలు వాతావరణంలోని పైపొరల్లోకి చేరడం వల్ల ఆకాశం అసాధారణంగా ఎర్రటి రంగులో కనిపిస్తుంది. అర్నబ్ తుపాను విషయంలోనూ ఇదే జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ భయానక దృశ్యాలు సోషల్ మీడియాలో సృజనాత్మక చర్చకు

దారితీశాయి. ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్ట్రేంజర్ థింగ్స్'లోని 'అప్‌సైడ్ డౌన్' ప్రపంచాన్ని గుర్తుచేస్తోందని ఒక యూజర్ కామెంట్ చేయగా, 'వెక్నా వస్తున్నాడు' అంటూ మరో యూజర్ పోస్ట్ చేశారు. మరికొందరు దీన్ని 'ఈవిల్ డెడ్' సినిమా సెట్‌తో పోల్చారు. అయితే, కొందరు మాత్రం ఇది ప్రమాదకరమైన సంకేతం కావచ్చని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇలాంటి ఘటనే ఈ ఏడాది మే నెలలో ఆస్ట్రేలియాలోనూ చోటుచేసుకుంది. 'నరెల్లే' తుపాను పశ్చిమ ఆస్ట్రేలియాలోని డెన్‌హామ్‌ను తాకినప్పుడు ఆకాశం ఇలాగే ఎర్రగా మారింది. అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, ఆస్ట్రేలియాలోని ఆ ప్రాంత నేలల్లో ఇనుము శాతం అధికంగా ఉంటుంది. తుపాను గాలుల వల్ల ఈ మట్టి గాలిలో కలిసి ఆక్సీకరణకు గురైనప్పుడు, ఆకాశం అంగారక గ్రహంలా ఎరుపు రంగులోకి కనిపిస్తుంది. కాగా, 'అత్యంత తీవ్రమైన తుపాను'గా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వర్గీకరించిన అర్నబ్ తుపాను, అక్టోబర్ 28న గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. దీని ప్రభావంతో భారీ వృక్షాలు నేలకూలాయి, పంటలు, ఇళ్లు నీట మునిగాయి. రవాణా, విద్యుత్ వ్యవస్థలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, మత్స్యకార కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.

రబీ సాగుపై ఎల్‌నినో పంజా

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దేశంలో వ్యవసాయ రంగంపై ఆందోళన పెంచుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ (వర్షాకాలం) పంటల సీజన్‌ను అతలాకుతలం చేసిన ఎల్‌నినో ప్రభావం ఇప్పుడు రబీ (శీతాకాలం) పంటలపైనా తీవ్రంగా పడుతోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వాతావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింది. దీని వల్ల పొలాల్లో తగినంత తేమ లేక రైతులు సాగు పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేలలో తేమ తగ్గడం సహా సాగునీటి లభ్యతపై ఆందోళనల కారణంగా గోధుమలు, శనగలు సహా పలు పంటల సాగు నెమ్మదించింది. ఈ ఎల్‌నినో- రబీ పంటల విత్తనాలు వేసే ప్రక్రియను తీవ్రంగా ప్రభావితం చేసింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఆందోళనకరమైన పరిస్థితుల్ని కళ్లకు కట్టింది.

సగానికిపైగా పడిపోయిన గోధుమల సాగు

సాధారణంగా గోధుమల సాగు కాలం దేశంలో అక్టోబర్ నుంచి నవంబర్ వరకు ఉంటుంది. మార్చి- ఏప్రిల్ నాటికి కోతకు వస్తుంది. అయితే కేంద్ర వ్యవసాయ శాఖ రిపోర్ట్ ప్రకారం గత పంటల కాలం (2025-26) అక్టోబర్ 23వ తేదీ గణాంకాలతో పోలిస్తే, ప్రస్తుత పంటల సంవత్సరంలో (2026-27) గోధుమల సాగు విస్తీర్ణం ఏకంగా 59 శాతం క్షీణించింది. గతేడాది ఇదే సమయానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 27 వేల (0.27 లక్షలు) హెక్టార్లలో గోధుమ విత్తనాలు వేయగా, ఈసారి చూస్తే అది కేవలం 11 వేల (0.11 లక్షలు) హెక్టార్లకే పరిమితమైంది. గోధుమలతో పాటు శనగలు, అన్ని రకాల పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం కూడా భారీగా పడిపోయింది.

గతేడాది అక్టోబర్ 23 నాటికి 3.77 లక్షల హెక్టార్లలో శనగలు సాగు చేయగా, ఈసారి 2.21 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు తగ్గడం కూడా ఆహార సరఫరాపై ప్రభావం చూపొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజస్థాన్‌లోనే 58 శాతం తగ్గిన రబీ సాగు

రాజస్థాన్ రాష్ట్రంలో రబీ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గోధుమలు, ఆవాలు, బార్లీ, శనగలు, కందులు, బఠానీలు వంటి పంటలు కలిగి గతేడాది ఇక్కడ అక్టోబర్ 23 నాటికి 14.13 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ఈ ఏడాది అదే తేదీ నాటికి చూస్తే 5.93 లక్షల హెక్టార్లలోనే సాగు జరిగింది. ఇక్కడ రికార్డు స్థాయిలో 8.21 లక్షల హెక్టార్ల మేర తగ్గుదల నమోదైంది. ఇది దాదాపు 58 శాతానికి సమానం. తమిళనాడులో కూడా రబీ సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గింది. యూపీలో స్వల్పంగా ప్రభావం కనిపిస్తోంది. మధ్యప్రదేశ్‌లో గతేడాది 0.20 లక్షల హెక్టార్లలో రబీ సాగు కాగా, ఈసారి అసలు నమోదు కాలేదు. ఉత్తరాఖండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేరళంలో గతేడాది 0.14 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.11 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. ఇలా దేశవ్యాప్తంగా 2026, అక్టోబర్ 23 వ తేదీ నాటికి చూస్తే రబీ పంటల మొత్తం సాగు విస్తీర్ణం 18.02 లక్షల హెక్టార్లుగా ఉంది. గతేడాది ఇదే తేదీ నాటికి ఇది ఏకంగా 28.26 లక్షల హెక్టార్లుగా ఉండటం గమనార్హం. ఎల్‌నినో కారణాలతో ఈసారి 10.24 లక్షల హెక్టార్ల వరకు తగ్గుదల నమోదైంది. ఈసారి శీతాకాలంలో వరి సాగు విస్తీర్ణం కూడా సగానికి సగం తగ్గింది. ఇదిలా ఉండగా, జొన్న, సజ్జ, రాగులు, ఇతర చిరుధాన్యాలు వంటి వాటి సాగు విస్తీర్ణం మాత్రం 13 వేల హెక్టార్ల నుంచి ఈసారి 23 వేల హెక్టార్లకు పెరగడం విశేషం. అయితే అన్ని రాష్ట్రాల్లో సాగు తగ్గలేదు. కర్ణాటకలో రబీ పంటల సాగు విస్తీర్ణం 1.80 లక్షల హెక్టార్ల నుంచి 1.91 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా 0.23 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.37 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో రుతుపవనాల సీజన్‌లో జూన్- సెప్టెంబర్ మధ్య దేశంలో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లో సాధారణం కంటే 38 శాతం, రాజస్థాన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ చివరినాటికి ఈ రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలు కూడా తక్కువగా ఉన్నాయి. దేశంలోని మొత్తం గోధుమ సాగు విస్తీర్ణంలో పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల వాటానే 31 శాతంగా ఉండగా, ఈ రాష్ట్రాల్లోనే ఇప్పుడు ఎక్కువగా సాగు విస్తీర్ణం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

పోలీసుల లాఠీలకు భయపడొద్దు

నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు.

"చలో దిల్లీ రాంలీలా మార్చ్, ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, ఓటు చోరీని అరికట్టడానికి, రాజ్యాంగాన్ని రక్షించడానికి చేపట్టిన పాదయాత్ర. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీది కాదు, ఇది భారతదేశ ఆత్మ పాదయాత్ర. నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌లతో విసిగిపోయిన ప్రజలందరూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుకునేవారు, రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకునే వారందరూ రావాలి. పోలీసులు, లాఠీల గురించి భయపడకండి. కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు. మాతో కవాతు చేయండి. రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించడానికి మనం కలిసి నడుద్దాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది దేశం కోసం జరుగుతున్న యాత్ర, ఇది మీ యాత్ర. మీరందరూ రండి మనమందరం కలిసి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం. భారతదేశంపై

దాడి జరుగుతోందని, భావ వ్యక్తీకరణపై, ఆలోచనలపై, దాడి జరుగుతోందని మీరు భావిస్తే రాజకీయలతో సంబంధం లేకుండా వచ్చి మాతో చేరండి. ఇది ఒక అద్భుతమైన యాత్ర కానుంది. ఇది మన దేశ ఆత్మను కాపాడేందుకు జరుగుతున్న యాత్ర."

ఖర్గే నివాసంలో ఇండీ కూటమి నేతల మీటింగ్

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్?, గౌరవ్ గొగోయ్? సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్? పార్లమెంట్?లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది.

అనేది దేశంలోని మెజారిటీ వర్గాల ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును లాక్కోవడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పన్నిన ఒక 'కుట్ర' అని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కుట్రను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అమలు చేశారని విమర్శించింది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్ పదవి నుంచి వైదొలగాలని, ా×=ను నిలిపివేయాలని, ఈసీఐనెట్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్? వేదికగా తెలిపారు. ఎస్ఐఆర్ పూర్తయిన లేదా కొనసాగుతున్న కనీసం ఆరు రాష్ట్రాల్లో, ఇప్పటివరకు గుర్తించిన అనుమానిత విదేశీయుల సంఖ్య సుమారుగా 1,600 మంది ఓటర్లతో పోలిస్తే చాలా తక్కువ అంటూ పేర్కొన్న మీడియా నివేదికను పోస్ట్ చేశారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం..

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుం డంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్? తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్ధరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావా దేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

'విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు'

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?" అని అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. "ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్?పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

మహువా మొయిత్రా పిటిషన్ కొట్టివేత

దేశ ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు, వాటి అసలు లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని సెబీని ఆదేశించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ౹వీజ ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ డి.కె.ఉపాధ్యాయలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. ఒక ఎంపీగా ఈ అంశాన్ని పార్లమెంటులో ఎందుకు లేవనెత్తలేదని, అక్కడ ఎందుకు చర్చ కోరలేదని ధర్మాసనం ప్రశ్నించింది. పెట్టుబడిదారుల వివరాలను బహిర్గతం చేయటానికి ప్రస్తుతం చట్టపరమైన వ్యవస్థ కానీ ఫ్రేమ్‌వర్క్ లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం కోర్టు ఒక కొత్త నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించాల్సి ఉంటుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద తనకు ఉన్న అధికార పరిధిని ఉపయోగించి కోర్టు అలాంటి పనిని చేయలేదని చెప్పింది. అయినా సెబీకి ఆదేశాలు ఇవ్వొచ్చని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ ఫండ్స్ వెనక ఉన్న అసలు వ్యక్తులు కంపెనీల షేర్ల విలువను అమాంతం పెంచి అమాయక పెట్టుబడిదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల అసలు లబ్ధిదారుల వివరాలు వెల్లడించేలా ఆదేశించాలని కోరారు. కంపెనీల్లో జరుగుతున్న భారీ పెట్టుబడుల వెనుక ఎవరున్నారో తెలుసుకునే హక్కు సాధారణ పెట్టుబడిదారులకు ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విదేశీ సంస్థల ద్వారా అస్పష్టమైన మార్గాల్లో పెట్టుబడులు వచ్చినప్పుడు ఇది మరింత ముఖ్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. అపారదర్శక ఆర్థిక సాధనాల ద్వారా స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెబీ అనేది సెక్యూరిటీ మార్కెట్లను నియంత్రించే సంస్థ అని, ఏఐఎఫ్, ఎఫ్‌పీఐల కార్యకలాపాలను పర్యవేక్షించడం దాని బాధ్యత అని పేర్కొన్నారు. అయితే, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అంతిమ లబ్ధిదారుల వివరాలను వెల్లడించడం అవసరమని కోర్టు భావిస్తే, మార్కెట్‌లోని పెట్టుబడుల వెనుక ఎవరున్నారో పౌరులు తెలుసుకునేందుకు వీలుగా ఆదేశించవచ్చని భూషణ్ కోర్టుకు చెప్పారు. ఈ సమస్య కేవలం సెబీ వద్ద సమాచారం ఉండటం లేదా లేకపోవడానికి సంబంధించినది మాత్రమే కాదన్నారు. షేర్లను ఎవరు కొనుగోలు చేస్తున్నారు, విక్రయిస్తున్నారు? ఆ పెట్టుబడుల వల్ల అంతిమంగా ఎవరు లబ్ధి పొందుతున్నారు

సంపాదకీయం

ఎల్‌నినో పంజా..

ప్రకృతి హెచ్చరికను పట్టించుకుంటామా?

మారుతున్న వాతావరణం.. మానవాళి మనుగడకు సవాల్

వచ్చే మార్చి నాటికి భారత్‌లో 55 వేల ఉష్ణ సంబంధిత మరణాల ముప్పు

ప్రకృతి హెచ్చరిస్తోంది. భూమి వేడెక్కుతోంది. సముద్రాలు అసాధారణ ఉష్ణోగ్రతలను సంతరించుకుంటున్నాయి. ఒకవైపు కుండపోత వర్షాలు, మరోవైపు మండే ఎండలు, ఇంకోవైపు కరవు పరిస్థితులు మానవాళి మనుగడకు సవాల్ విసురుతున్నాయి. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టడం, నష్టపరిహారం ప్రకటించడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. కానీ విపత్తులు సంభవించకముందే వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు ఎంతవరకు సిద్ధమవుతున్నామన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో దృగ్విషయం నేపథ్యంలో వెలువడిన ఉష్ణ సంబంధిత మరణాల అంచనాలు ఈ ప్రశ్నను మరింత బలంగా ముందుకు తెచ్చాయి. క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ రూపొందించిన 'ఎల్‌నినో హీట్ మోర్టాలిటీ ట్రాకర్' అంచనాల ప్రకారం 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు 3.73 లక్షల అదనపు ఉష్ణ సంబంధిత మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. ఒక్క భారతదేశంలోనే సుమారు 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా వేయడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇవి ఖచ్చితంగా సంభవించబోయే మరణాలు కావు. వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతల ప్రభావం, ప్రజారోగ్య గణాంకాల ఆధారంగా రూపొందించిన ముందస్తు అంచనాలు మాత్రమే. అయినప్పటికీ ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్న హెచ్చరికను నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. భూమధ్యరేఖ సమీపంలోని మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగడాన్ని ఎల్‌నినో అంటారు. సాధారణంగా రెండు నుంచి ఏడు సంవత్సరాల మధ్య విరామంతో ఏర్పడే ఈ సహజ దృగ్విషయం ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలుల కదలికలపై ప్రభావం చూపుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడితే మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చు. వ్యవసాయం, నీటి వనరులు, విద్యుత్ వినియోగం, ప్రజారోగ్యంపై దీని ప్రభావం ఉంటుంది. అయితే ప్రతి వాతావరణ విపత్తుకూ ఎల్‌నినో ఒక్కటే కారణం కాదు. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న భూతాపం, అడవుల నరికివేత, నగరాల్లో కాంక్రీటు విస్తరణ వంటి పరిణామాలు కూడా ఉష్ణోగ్రతల తీవ్రతను పెంచుతున్నాయి. సహజ వాతావరణ మార్పులకు మానవ చర్యల ప్రభావం తోడైతే ప్రమాదం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. భారత్‌లో వచ్చే మార్చి నాటికి 55 వేల అదనపు ఉష్ణ సంబంధిత మరణాలు సంభవించవచ్చన్న అంచనా ప్రజారోగ్య వ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తుచేస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు కేవలం వడదెబ్బకే పరిమితం కావు. గుండె, మూత్రపిండాలు, శ్వాసకోశ సంబంధిత సమస్యలున్న వారి ఆరోగ్య పరిస్థితులను మరింత తీవ్రతరం చేయవచ్చు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, రోజువారీ కూలీలు, నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు అధిక వేడి ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఎక్కువ. ఎండలో పనిచేయక తప్పని లక్షలాది మంది కార్మికులకు తగిన రక్షణ చర్యలు అందుబాటులో ఉన్నాయా? గ్రామీణ ప్రాంతాల్లో వడదెబ్బ నివారణపై ప్రజలకు ఎంతవరకు అవగాహన ఉంది? అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు సిద్ధంగా ఉన్నాయా? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉంది. వాతావరణ మార్పులు అందరినీ ప్రభావితం చేసినప్పటికీ వాటిని ఎదుర్కొనే సామర్థ్యం అందరికీ ఒకేలా ఉండదు. శీతలీకరణ సదుపాయాలు ఉన్నవారు కొంతవరకు వేడి నుంచి రక్షణ పొందగలరు. కానీ రోజువారీ కూలిపై ఆధారపడే కార్మికుడు ఎండ తీవ్రంగా ఉందని పని మానేయగలడా? పంటను కాపాడుకునేందుకు పొలంలో పనిచేసే రైతు మండే ఎండ నుంచి తప్పించుకోగలడా? ఇక్కడే వాతావరణ మార్పులు సామాజిక, ఆర్థిక అసమానతలతో ముడిపడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో పని గంటలు తగ్గితే కార్మికుల ఆదాయం దెబ్బతింటుంది. పంట దిగుబడులు తగ్గితే రైతులు నష్టపోతారు. తాగునీటి కొరత ఏర్పడితే పేద కుటుంబాల జీవనం మరింత కష్టమవుతుంది. అందువల్ల వాతావరణ మార్పులను కేవలం పర్యావరణ సమస్యగా కాకుండా ప్రజారోగ్యం, ఉపాధి, ఆహార భద్రతతో ముడిపడిన అంశంగా చూడాలి. నగరాలు విస్తరిస్తున్నాయి. ఎత్తయిన భవనాలు, రహదారులు, పరిశ్రమలు పెరుగుతున్నాయి. అభివృద్ధికి ఇవన్నీ అవసరమే. కానీ అదే సమయంలో పచ్చదనం తగ్గిపోవడం, చెరువులు కనుమరుగవడం, సహజ నీటి ప్రవాహ మార్గాలు మూసుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. చెట్ల నీడ లేని రహదారులు, కాంక్రీటుతో నిండిన నివాస ప్రాంతాలు వేసవిలో ఉష్ణోగ్రతల ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. అభివృద్ధిని కేవలం నిర్మాణాల సంఖ్యతో కాకుండా ప్రజలు ఆరోగ్యంగా, సురక్షితంగా జీవించగలిగే పరిస్థితులతోనూ కొలవాలి. క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అంచనాల ప్రకారం నైజీరియాలో సుమారు 56 వేలు, భారత్‌లో 55 వేలు, ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల అదనపు ఉష్ణ సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలపై ప్రమాద భారం ఎక్కువగా ఉండవచ్చని ఈ అంచనాలు సూచిస్తున్నాయి. కాలుష్య ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడం, అడవులను పరిరక్షించడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను రూపొందించడం వంటి చర్యలకు ప్రపంచ దేశాలు ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ ప్రమాదాలను ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను బలోపేతం చేయాలి. జిల్లా స్థాయిలో వేడిగాలుల హెచ్చరికలను ప్రజలకు సకాలంలో అందించాలి. ఎండలో పనిచేసే కార్మికులకు తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలి. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పచ్చదనం పెంపు, చెరువుల పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రకృతి విపత్తులు సంభవించిన తర్వాత బాధితులకు పరిహారం ప్రకటించడం ప్రభుత్వాల బాధ్యత. కానీ ప్రాణనష్టం జరగకముందే దానిని నివారించేందుకు చర్యలు తీసుకోవడం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. శాస్త్రవేత్తలు ప్రమాదాన్ని అంచనా వేయగలరు. వాతావరణ సంస్థలు హెచ్చరికలు జారీ చేయగలవు. ఆ హెచ్చరికలను ప్రజల ప్రాణాలను కాపాడే కార్యాచరణగా మార్చాల్సింది ప్రభుత్వాలే.

ప్రకృతి తన హెచ్చరికలను వినిపిస్తోంది. వాటిని పట్టించుకుని ప్రాణాలను కాపాడుకుంటామా? లేక విపత్తు సంభవించిన తర్వాత నష్టాన్ని లెక్కపెడుతూ మిగిలిపోతామా? అన్నది ఇప్పుడు మన ముందున్న అసలు ప్రశ్న.

జాతీయ పరీక్షల సంస్కరణలపై పార్లమెంటరీ కమిటీ దృష్టి

- కాంగ్రెస్‌కు సీట్లు ఎన్నో చెప్పండి!
- కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు
- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- బ్యాలెట్ పత్రాలతోనే పోలింగ్.. అయినా ఫలితాలపై చురకలు
- కర్ణాటకలో అధికార కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ
- నాలుగు స్థానాల్లోనూ ఓటమి.. బీజేపీకి మూడు, జేడీఎస్‌కు ఒక స్థానం



న్యూఢిల్లీ, అక్టోబర్ 29: జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పారదర్శకత, లోపాల నివారణపై పార్లమెంటరీ స్థాయీ సంఘం దృష్టి సారించింది. నీట్-యూజీ ప్రశ్నపత్రాల లీకేజీ వివాదం, 2026 పరీక్ష రద్దు నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో అవసరమైన సంస్కరణలను సమగ్రంగా సమీక్షించాలని నిర్ణయించింది. కోచింగ్ సెంటర్ల పనితీరు, వాటికి సంబంధించిన నిబంధనలు, వాటి అమలు తీరును కూడా పరిశీలించనుంది. 2026-27 సంవత్సరానికి సమీక్షాంశాలను ఎంపిక చేసుకున్న విద్యా, మహిళా, శిశు, యువజన, క్రీడల శాఖల పార్లమెంటరీ కమిటీ జాతీయ విద్యా విధానం-2020 అమలుపైనా అధ్యయనం చేయనుంది. ఎన్‌సీఈఆర్టీ, సీబీఎస్‌ఈ పనితీరు, గుర్తింపు నిబంధనలు, పరీక్షల నిర్వహణతో పాటు వాటి విదేశీ కార్యకలాపాలను సమీక్షించనుంది. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వ్యవహారాలనూ పరిశీలించనుంది. పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, మానసిక సంక్షేమం, సమ్మిళిత విద్య, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలపై కమిటీ ప్రత్యేకంగా దృష్టి పెట్టనుంది. విద్యార్థులకు అందుతున్న సహాయక సేవలు ఎంతవరకు సమర్థంగా పనిచేస్తున్నాయో అంచనా వేయనుంది. విద్యారంగంలో కృత్రిమ మేధ (ఏఐ), నూతన సాంకేతికతల ప్రభావం, వాటి ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు, భవిష్యత్తు ఉద్యోగావకాశాలపై ప్రభావాన్ని కూడా అధ్యయనం చేయనుంది. ఉన్నత విద్యలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, విదేశీ విశ్వవిద్యాలయాల కార్యకలాపాలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన నిబంధనలు, మార్గదర్శకాల అమలును సైతం సమీక్షించనుంది. పరీక్షల నిర్వహణలో సంస్థాగత లోపాలను గుర్తించి, కోచింగ్ వ్యవస్థపై పర్యవేక్షణను మెరుగుపరచడం వంటి అంశాలు ఈ సమీక్షలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. దేశవ్యాప్తంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు న్యాయబద్ధమైన పరీక్షా విధానం అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ పరిశీలన కీలకంగా మారనుంది.

ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ పాటించాలి

- ఉగ్రవాద ప్రోత్సాహక దేశాలపై కఠిన వైఖరి: రాజ్‌నాథ్ సింగ్
- భారత్-అమెరికా పదేళ్ల రక్షణ ఒప్పందంపై సమీక్ష
- సైనిక సాంకేతికత, ఉమ్మడి ఉత్పత్తికి ప్రాధాన్యం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం: పీట్ హెగ్‌సెత్



సెబూ, అక్టోబర్ 29: ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చే, శిక్షణ అందించే, నిధులు సమకూర్చే దేశాల పట్ల ప్రపంచ దేశాలు ఉపేక్ష చూపకూడదని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలపై జీరో టాలరెన్స్ విధానం అనుసరించాలని పిలుపునిచ్చారు. ఫిలిప్పీన్స్‌లోని సెబూలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌తో బుధవారం జరిగిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల అవతలి నుంచి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్‌కు అమెరికా మద్దతు కొనసాగుతుందని హెగ్‌సెత్ తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో అమెరికా అందిస్తున్న సహకారానికి రాజ్‌నాథ్ సింగ్ కృతజ్ఞతలు చెప్పారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన పదేళ్ల రక్షణ సహకార ఒప్పందం అమలులో పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. సైనిక సాంకేతికత, సమాచార మార్పిడి, రక్షణ పరికరాల ఉమ్మడి తయారీ, సైనిక దళాల మధ్య సమన్వయం, సముద్ర భద్రత వంటి అంశాలపై చర్చించారు. ఇటీవల నిర్వహించిన 'యుద్ధ్ అభ్యాస్' సంయుక్త సైనిక విన్యాసాలను కూడా ప్రస్తావించారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సురక్షిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంలో ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశం అద్భుతంగా సాగిందని రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఆసియాన్ సభ్య దేశాలు, వాటి సంభాషణ భాగస్వామ్య దేశాల సమావేశంలో పాల్గొనేందుకు ఇరువురు నేతలు సెబూకు వెళ్లారు. భారత్-అమెరికా ప్రధాన రక్షణ భాగస్వామ్యానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించినట్లు అమెరికా ప్రకటన వెల్లడించింది. సైనిక కార్యకలాపాల్లో సమన్వయం, సమాచార భాగస్వామ్యం, రక్షణ పరిశ్రమల మధ్య సహకారాన్ని విస్తరించేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటంతో పాటు ప్రాంతీయ భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ఇరు దేశాల రక్షణ సంబంధాల్లో కీలకంగా నిలిచాయి.

నసీరుద్దీన్ షాపై కిరణ్ రిజిజు విమర్శలు

నటుడిని 'అర్బన్ దిమాగీ నక్సల్'గా అభివర్ణించిన కిరణ్ రిజిజు

జామియా విద్యార్థుల ఆందోళనకు నసీరుద్దీన్ షా మద్దతు

ప్రభుత్వంపై నటుడి విమర్శలు.. షైనా ఎన్‌సీ ప్రశ్నలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మధ్య మాటల యుద్ధం మొదలైంది. విద్యార్థుల ఆందోళనలకు మద్దతుగా నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. నటుడిని 'ప్రమాదకరమైన అర్బన్ దిమాగీ నక్సల్'గా అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి హానికరమని విమర్శించారు. ఒకప్పుడు నసీరుద్దీన్ షాను గౌరవించేవాడినని, అయితే ఆయన అసలు వైఖరి ఆలస్యంగా తెలిసిందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులకు మద్దతుగా నసీరుద్దీన్ షా సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశారు. 'దిమాగీ నక్సల్' అని రాసి ఉన్న బ్యాడ్జ్ ధరించి, విద్యా వ్యవస్థను దెబ్బతీసేందుకు, యువత ధైర్యాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తనలాంటి వారిని దేశద్రోహులు, 'తుక్డే తుక్డే గ్యాంగ్'గా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ వివాదంపై శివసేన నాయకురాలు షైనా ఎన్‌సీ కూడా స్పందించారు. 'సర్ఫరోష్' సినిమాలోని ఏసీపీ రాథోడ్ తరహాలో ఆలోచిస్తున్నారా? లేక ప్రతినాయకుడు గులామ్ హసన్ తరహాలోనా? అని నసీరుద్దీన్ షాను ప్రశ్నించారు. ఆయన దేశానికి అనుకూలమా, వ్యతిరేకమా అన్నది స్పష్టం చేయాలని వ్యాఖ్యానించారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'దిమాగీ నక్సల్' పదాన్ని ఉపయోగించారు. వ్యవస్థలోకి ప్రవేశించి విధానాలను తప్పుదోవ పట్టించే వ్యక్తులను ఉద్దేశించి ఈ పదాన్ని వాడారు. నీట్ పరీక్షలో అక్రమాలు, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్లలో విద్యార్థుల నిరసనల అంశాలపై కూడా నసీరుద్దీన్ షా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వీడియోలు విడుదల చేస్తున్నట్లు సమాచారం.

శాంతి ఒప్పందంపై నేహా బోరా నిరాకరణ

నవంబర్ 20న ఎస్‌ఈఎం కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

ఆరు ఎఫ్‌ఐఆర్‌లు, దర్యాప్తు పత్రాలు అందజేత

నిరసన హక్కును అణచివేస్తున్నారంటూ నేహా అభ్యంతరం

జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మొదలైన వివాదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా శాంతి ఒప్పందంపై సంతకం చేసేందుకు నాలుగోసారి నిరాకరించడంతో ఢిల్లీ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్‌ఈఎం) కోర్టు ఆమెకు సమన్లు జారీ చేసింది. నవంబర్ 20న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. శాంతియుత నిరసన తెలపడం నేరం కాదని, పీస్ బాండ్ పేరుతో భావప్రకటన స్వేచ్ఛ, నిరసన హక్కులను అణచివేస్తున్నారని నేహా బోరా వాదిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఆరు ఎఫ్‌ఐఆర్‌లు, దర్యాప్తు పత్రాలను నేహా బోరాకు అందించాలని ఎస్‌ఈఎం కోర్టు ఆదేశించింది. శాంతిభద్రతలకు భంగం కలగవచ్చని పోలీసులు భావించడానికి ఆధారమైన పత్రాలను అందజేయాలని స్పష్టం చేసింది. పోలీసులు ఆ డాక్యుమెంట్లను ఆమెకు అప్పగించారు. అంతకుముందు అక్టోబర్ 23న పోలీసులు జారీ చేసిన షోకాజ్ నోటీసులు, సమన్లను రద్దు చేయాలని నేహా బోరా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆమె పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యవహారం అక్టోబర్ 16న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలకు పిలుపునివ్వడంతో ప్రారంభమైంది. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు ఉన్నప్పటికీ అక్కడికి వెళ్లేందుకు, ఇతరులను ప్రేరేపించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలతో పోలీసులు నేహా బోరాపై చర్యలకు సిఫార్సు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్) సెక్షన్ 126 కింద చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో శాంతి ఒప్పందంపై సంతకం చేయాలని పోలీసులు ఆమెను ఆదేశించారు. అయితే, ఇది ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని నేహా బోరా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 20న విచారణ సందర్భంగా ఎస్‌ఈఎం కోర్టు తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.

లాఠీలకు భయపడొద్దు.. మార్చ్‌పై వెనక్కి తగ్గేదేలే!

నవంబర్ 1న ఢిల్లీలో చలో రామ్‌లీలా మార్చ్

ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ పిలుపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న చలో రామ్‌లీలా మార్చ్‌పై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పోలీసుల చర్యలకు, లాఠీలకు భయపడకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను కాపాడుకోవడం కోసం చేపట్టిన ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎక్స్ వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో కోరారు. ఈ మార్చ్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, దేశ ఆత్మకు సంబంధించినదని రాహుల్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరితో విసిగిపోయినవారు ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, భావప్రకటనా స్వేచ్ఛపై దాడి జరుగుతోందని భావించే విద్యార్థి సంఘాలు సైతం మార్చ్‌లో భాగస్వాములు కావాలని కోరారు. దేశం కోసం, పౌరుల హక్కుల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఎలాంటి ఆందోళన లేకుండా పాల్గొనాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో జరగనున్న ఈ ర్యాలీకి కాంగ్రెస్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూటమి ఎంపీలతో సమావేశమై కార్యక్రమంపై చర్చించారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు.కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లోనూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు విశేష సేవలందించారని పేర్కొన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రజారోగ్య కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవా కాలం, విద్యార్హతలు, అనుభవం, విధుల స్వభావంపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణ జరిగే వరకు ఉద్యోగులకు తగిన వేతనాలు, సమయానికి జీతాలు, ఇతర సేవా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి, రెగ్యులరైజేషన్‌పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు మర్సకుల సరస్వతి, బీ ఆర్ ఎస్ మండల, టౌన్ అధ్యక్షులు రవీందర్, అహ్మద్ బీన్ అబ్దుల్లా, నాయకులు నిసార్, అన్సార్, గుండా శ్యామ్, సందీప్, ఖాసీం, పొన్నాల నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటి.. కాలినడకన పల్లె బాట పట్టిన కలెక్టర్ హరిత

పాఠశాల సందర్శన.. చిన్నారులకు చాక్లెట్ల పంపిణీ

అర్హులందరికీ 'ప్రధాన్ మంత్రి జన్మన్' ఇళ్లు

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలన, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జిల్లా కలెక్టర్ కే హరిత ప్రత్యేక చొరవ చూపారు. కెరమేరి మండలం దేవాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కొలంగూడ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య పరీక్షా శిబిరానికి వెళ్లేందుకు కలెక్టర్ ఏమాత్రం వెనుకాడలేదు. గ్రామానికి వెళ్లే దారిలో ఎదురైన వాగును కలెక్టర్ కే హరిత గ్రామస్థులతో కలిసి కాలినడకనే దాటి వెళ్లారు. ప్రజా సమస్యలను, వారి ఆరోగ్య అవసరాలను నేరుగా తెలుసుకునేందుకు ఎంతటి దుర్భరమైన దారినైనా లెక్క చేయకుండా ముందుకు సాగడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.

తెలంగాణను 'కరువు రాష్ట్రం'గా ప్రకటించాలి

- రూ. 50 వేల కోట్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి
- రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యంతో పాటు 14 రకాల నిత్యవసర వస్తువులు ఇవ్వాలి
- ఎస్పీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ : తెలంగాణను 'కరువు రాష్ట్రం'గా ప్రకటించి, రూ.50 వేల కోట్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారి రవికుమార్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ ,జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎల్ నినో హెచ్చరికలు కొన్ని రోజులుగా జరుగుతున్నప్పటికీ వాటికి నివారణ చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన కరువు ఛాయలు నెలకొన్నాయని, తాజాగా 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం దాన్ని వెనక్కి తీసుకొని రాష్ట్ర మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 25% నోటు వర్షపాతం నమోదయిందని, 6 లక్షల బోర్లు ఇప్పటికే నీరు లేక నోరు వెళ్ళబెట్టాయన్నారు. తాగునీరు, సాగునీరు కొరత ఏర్పడుతుందని, ధరల పెరుగుదల కొనసాగుతోందన్నారు. ఎకరానికి వాణిజ్య పంటకు 50వేల రూపాయలు, ఇతర పంటలకు 30000 రూపాయలు చెల్లించాలని, రైతు భరోసా రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని రోజుకు 800 రూపాయలు చెల్లించాలన్నారు. ధరల పెరుగుదలతో వృత్తిదారులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని దాన్ని నివారించాలన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇవ్వడం లేదని ఇప్పటికే మహారాష్ట్రకు 5000 కోట్లు కేటాయించి రాష్ట్రానికి కేటాయించకపోవడం దారుణం అన్నారు. రాష్ట్రంలో బిజెపి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కూడా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకోవచ్చు నిధులు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రానికి 50వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యంతో పాటు పప్పు, చింతపండు లాంటి 14 రకాల వస్తువులు అందించాలని, వీటిలో 10 ఉచితంగా, 4 వస్తువులు సబ్సిడీతో అందించాలని తెలిపారు. వ్యవసాయ కూలీలను కౌలు రైతులను ఆదుకోవాలని అన్నారు. ఆరుతడి పంటలు వేయాలని చెబుతున్న ప్రభుత్వం ఏ పంటలు వేయాలో చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరుతడి పంటలపై నిర్దిష్ట ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పల్లెల్లో వస్తున్న కరువు పట్టణాలకు కూడా రానున్న రోజుల్లో తాకుతుందని అక్కడ పని దొరికే పరిస్థితులు ఉండవన్నారు. వీటన్నింటినీ ముందుగా రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసి దాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ అధికారుల దాడులు గిరిజనులపై పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టైగర్ రిజర్వ్ పేరుతో భూములను గిరిజనుల నుండి కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తిప్పి కొడతామని హెచ్చరించారు. కరువు పరిస్థితులు తెలుసుకొనేందుకు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే కరువు ప్రభావిత ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు యజమానులతో సంబంధం లేకుండా సాగులో ఉన్న రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెంబి నుండి జన్నారం వరకు టైగర్ రిజర్వు పేరుతో గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఎక్కడైనా గిరిజనులపై దాడులు జరిగితే రైతులంతా కలిసి అధికార పార్టీ ఎమ్మెల్యే ఇంటిముందు బయటాయించాలంటూ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఎకరానికి కూడా పట్ట ఇవ్వకపోవడం ఇచ్చిన మాటను తుంగలో తొక్కడమేనన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకుడు భూపాల్ మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్ కార్మికులు గత 130 రోజుల నుండి వేతన ఒప్పందం, ఎన్నికల నిర్వహణ కోసం సమ్మె చేస్తున్న మిల్లు యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారి నిరసనకు మద్దతు తెలుపుతున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వారి జీతాలను పెంచాలన్నారు. వారికి అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్, ఆనంద్, కృష్ణమాచారి, టీకానంద్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిద్దాం.. వార్డును శుభ్రంగా ఉంచుకుందాం

ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వార్డును శుభ్రంగా ఉంచుకోవాలని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను శానిటరీ ఇన్స్పెక్టర్ రామయ్య, కాలనీవాసులతో కలిసి ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనుల పురోగతిని పర్యవేక్షించి, పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. వార్డులో చెత్త సేకరణ, మురుగు కాలువల శుభ్రత పనులు వేగవంతంగా జరగాలని ఆదేశించారు. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు ఎవరూ చెత్తను రోడ్లపై గానీ, డ్రైనేజీలలో గానీ వేయవద్దని విజ్ఞప్తి చేశారు. వార్డును పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో మున్సిపల్ సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నల్గొండ శ్రీరాములు, అనుమండ్ల శ్రీకాంత్, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నైతం రాజు సేవలు వెలకట్టలేనివి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘంలో చురుకుగా పనిచేయడంతో పాటు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన నైతం రాజు సేవలు వెలకట్టలేనివని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన నైతం రాజు సంస్మరణ సభలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారి రవికుమార్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, జిల్లా కార్యదర్శి కూసన రాజన్నలతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామంలో పుట్టిన రాజు 2015లో తన ప్రస్తానాన్ని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగారని గుర్తు చేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. రాజు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, మహాజన పాదయాత్ర బృందం సభ్యులు ఆవాజ్, పార్టీ జిల్లా నాయకులు దుర్గం దినకర్, శ్రీనివాస్, జె.రాజేందర్, ఆనంద్, కార్తీక్, టీకానంద్, నిఖిల్ పాల్గొన్నారు.

జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఉద్యమ కెరటం, కెరమెరి: జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంతో ముందుడుగు సాగాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని జిల్లా నుండి నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైన మందులు, పోషక ఆహారం 6 నెలల పాటు క్రమ తప్పకుండా తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. క్షయ వ్యాధిని నిర్మూలించడంలో ప్రారంభ దశలోనే గుర్తించక పోతే ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులు నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద చాల మంచి ఇండ్లు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అర్హులైన అందరికీ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో నాణ్యత ప్రమాణాలతో ఇండ్లు నిర్మించుకోవాలని తెలిపారు. గ్రామములో టి డబ్ల్యు పి ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని చిన్నారులకు చాక్లెట్లు అందించారు. అంతక ముందు క్షయ వ్యాధి నిర్మూలన వాహనాలను జండా ఊపి ప్రారంభించారు. అందరూ సమన్వయంతో కృషి చేసి క్షయ రహిత గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి వినయ్‌కుమార్, కొలంగూడ సర్పంచ్ కుమ్రంభీం రావు, ఉప సర్పంచ్ బారిక్ రావు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీవో భవనాల నిర్మాణానికి భూమిపూజ

• రూ.20 లక్షలతో సాత్ నంబర్, ఇస్లాంనగర్‌లో పనులకు శ్రీకారం

ఉద్యమ కెరటం, నేరడిగొండ (ఇచ్చోడ): ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న వీవో భవనాల నిర్మాణ పనులకు గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను ప్రారంభించి, గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిందని పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజలకు మెరుగైన వసతులు అందించవచ్చన్నారు. వీవో భవనాల నిర్మాణం పూర్తయితే మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు, సంఘాల కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించేందుకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, సర్పంచ్ రాథోడ్ రమేష్, ఉప సర్పంచ్ షబ్బీర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గాడ్గే సుభాష్, మనోహర్, రోహిదాస్, న్యాజ్, విక్రమ్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొమురంభీమ్ కు కలెక్టర్ ఘన నివాళి

• ఇంద్రవెల్లిలో పూజలు నిర్వహించిన అధికారులు, ఆదివాసీ నాయకులు

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వీర యోధుడు కొమురంభీమ్‌కు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘన నివాళులర్పించారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొమురంభీమ్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమురంభీమ్ ఆశయాలు, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతి, గిరిజనుల హక్కుల పరిరక్షణలో కొమురంభీమ్ పోరాట స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ మహేందర్, ఎంపీఓ సంజీవ్ రావు, కొమురంభీమ్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మెస్రం నాగ్‌నాథ్, కేస్లాపూర్ రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం వెంకటరావు పటేల్, గిన్నేరా రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం దుర్గ, ఇంద్రవెల్లి సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, ఆదివాసీ నాయకులు పూర్కా చిత్రు, కనక తుకారామ్, జుగాదిరావు, గేడం భరత్, సుంకట్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలో గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగామయి దయానంద్ పర్యటించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జంగా శ్రీనివాస రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతిచెందడంతో ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన బండి రవీంద్రరెడ్డి కుమారుడు వినోద్ కుమార్ రెడ్డి నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఎదుళ్ల నరసింహ కుమారుడు స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ, వారికి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల వీర వెంకటరెడ్డి, చిలుకూరి సత్యనారాయణ రెడ్డి,బండి వెంకట రెడ్డి, ఏసు ,కోండ్రు, మురళి,శేషు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ కె.హరిత మాట్లాడారు. జిల్లాలో రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాద బాధితులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని, 'ప్రధానమంత్రి రహత్ పథకం' కింద ఉచిత వైద్యం అందించే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై గుంతల పూడ్చివేత, మూల మలుపుల వద్ద చెట్ల తొలగింపు, రహదారులపై పశువుల సంచారాన్ని అరికట్టడం, పాఠశాలల్లో భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గడిచిన నెల రోజుల్లో అతివేగం, మద్యం మత్తు కారణాల వల్ల ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని ఎస్.పి. నితికా పంత్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఎస్పీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి

సన్ రైజ్ క్రికెట్ అకాడమీ కోచ్ షేక్ అమాన్

ఉద్యమ కెరటం, ఇచ్చోడ: రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్–19 క్రికెట్ పోటీలకు ఇచ్చోడలోని సన్ రైజ్ క్రికెట్ అకాడమీ నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ కోచ్ షేక్ అమాన్ తెలిపారు. ఈనెల 27న మంచిర్యాలలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో షేక్ ఫజల్, త్రిషూల్, రుద్ర, సోహెల్ క్రీడా ప్రతిభను కనబర్చినట్లు పేర్కొన్నారు. 31న మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారికి క్రికెట్‌లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు అకాడమీ కృషి చేస్తోందన్నారు. పరిమిత సౌకర్యాల మధ్య క్రమశిక్షణ, పట్టుదల, కఠోర సాధనతో నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. అకాడమీ నుంచి క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పలువురు వారికి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

డంపింగ్ యార్డ్ తరలింపుపై బీజేపీ వైఖరి ప్రకటించాలి

• రాజకీయ లబ్ధి కోసమే ఈటల పాదయాత్ర: తోటకూర వజ్రేష్ యాదవ్

ఉద్యమ కెరటం, జవహర్‌నగర్: జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపుపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారంపై చిత్తశుద్ధి చూపకుండా రాజకీయ ప్రయోజనాల కోసమే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం దమ్మాయిగూడలోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జవహర్‌నగర్ ప్రజలు ఏళ్ల తరబడి డంపింగ్ యార్డ్ కాలుష్యం, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసిన సమయంలో డంపింగ్ యార్డ్ తరలింపుపై ఎందుకు స్పందించలేదని ఈటల రాజేందర్‌ను ప్రశ్నించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఇప్పటి వరకు ఏంచేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు, సహకారం తీసుకురావడంలో ఎంపీ ఈటల రాజేందర్ చొరవ చూపాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. జవహర్‌నగర్ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ డంపింగ్ యార్డ్ తరలింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా ప్రజా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్ల అధ్యక్షులు, మున్సిపాలిటీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పారదర్శకమైన సేవలే లక్ష్యం

• మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని అన్ని కాంటాలను మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అధికారులతో కలిసి గురువారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది, రైతుల సమక్షంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో ఏ ఒక్క కాంటాలోనూ తూకానికి సంబంధించి ఎలాంటి తేడాలు, లోపాలు గుర్తించలేదని అన్నారు. నిబంధనల ప్రకారం అనుమతించదగిన తూకపు వ్యత్యాస పరిమితిని పరిశీలిస్తూ కాంటాల పనితీరును తనిఖీ చేసినట్లు తెలిపారు. రైతులు విక్రయించే పంటలకు సంబంధించి తూకంలో ఎలాంటి మోసాలకు తావులేకుండా పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. తనిఖీలకు సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి త్వరలోనే జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా సమర్పించనున్నట్లు వివరించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ యార్డులో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని, ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ ఎండీ అజీజ్ పాషా, లీగల్ మెట్రాలజీ విభాగం అధికారి నవీన్ రెడ్డి, సెలక్షన్ గ్రేడ్ అధికారులు విఠల్, స్వామి, హసన్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూపీఎల్ వేలం పూర్తి

- ఐదు జట్ల స్క్వాడ్లు ఖరారు
- వేలంలో 25 మంది క్రీడాకారిణుల కొనుగోలు
- 18 మంది భారత ప్లేయర్లు.. ఏడుగురు విదేశీయులు
- ఎనిమిది మందితో యూపీ వారియర్జ్ టాప్
- ఆర్‌సీబీ, ఢిల్లీ జట్లలో 17 మందే

కొచ్చి వేదికగా బుధవారం జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2027 మినీ వేలం ముగిసింది. ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లలో మిగిలిన స్థానాలను భర్తీ చేసుకున్నాయి. వేలంలో మొత్తం 25 మంది క్రీడాకారిణులు అమ్ముడుపోగా.. వారిలో 18 మంది భారతీయులు, ఏడుగురు విదేశీ ప్లేయర్లు ఉన్నారు. కొనుగోళ్లలో యూపీ వారియర్జ్ ఎనిమిది మందిని దక్కించుకోగా, ముంబై ఇండియన్స్ ఆరుగురిని తీసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ చెరో నలుగురిని కొనుగోలు చేశాయి. గుజరాత్ జెయింట్స్ ముగ్గురితో సరిపెట్టుకుంది. డబ్ల్యూపీఎల్ నిబంధనల ప్రకారం ఒక్కో జట్టులో గరిష్ఠంగా 18 మంది ఆటగాళ్లకు అవకాశం ఉంది. ముంబై ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్ 18 మందితో తమ జట్లను పూర్తి చేసుకున్నాయి. ఆర్‌సీబీ, ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం 17 మందితోనే సరిపెట్టుకున్నాయి. ముంబై ఇండియన్స్: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), నాట్ సివర్–బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, అమేలియా కెర్, షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజనా సజీవన్, రహిలా ఫిర్దౌస్, నికోలా కేరీ, వైష్ణవి శర్మ, తారా నోరిస్, దిశా కసత్, భారతి రావల్, లతిక ఇనామ్‌దార్, అక్షిత భగత్, శ్వేతా సెహ్రావత్, సానిక చాల్కే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: స్మృతి మంధాన (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), ఎలీస్ పెర్రీ, లారెన్ బెల్, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, నాడిన్ డి క్లర్క్, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, జార్జియా వోల్, జెస్ జొనాసెన్, తేజల్ హసబ్నిస్, సయాలీ సత్‌ఘరే, క్లోయ్ ట్రయాన్, ప్రేమ రావత్, బృందా దినేష్, ప్రత్యూష కుమార్. ఢిల్లీ క్యాపిటల్స్: జెమిమా రోడ్రిగ్స్ (కెప్టెన్), షెఫాలీ వర్మ, మరిజానే కాప్, నికీ ప్రసాద్, లారా వోల్వార్డ్ట్, చినెల్ హెన్రీ, శ్రీ చరణి, దీయా యాదవ్, మమతా మడివాలా, నందిని శర్మ, లూసీ హామిల్టన్, మిన్ను మణి, అన్నాబెల్ సదర్లాండ్, కిరణ్ నవ్‌గిరే, ఉమా కాశ్వీ, కిర్స్టీ గోర్డాన్, నజ్మా ఖాన్. యూపీ వారియర్జ్: మెగ్ లానింగ్ (కెప్టెన్), దీప్తి శర్మ, సోఫీ ఎక్లెస్టోన్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, హర్లీన్ డియోల్, క్రాంతి గౌడ్, శిఖా పాండే, షిప్రా గిరి, సిమ్రాన్ షేక్, ప్రతీక రావల్, సోఫీ మోలినెక్స్, గ్రేస్ హ్యారిస్, సుష్మా వర్మ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా, సహానా పవార్, మనాలి దక్షిణి, కేథరిన్ బ్రైస్, ఆశా శోభన. గుజరాత్ జెయింట్స్: యాష్లే గార్డ్‌నర్ (కెప్టెన్), బెత్ మూనీ, సోఫీ డివైన్, రేణుకా సింగ్ ఠాకూర్, భారతి ఫుల్‌మాలి, కాశ్వీ గౌతమ్, కనికా అహుజా, తనూజా కన్వర్, జార్జియా వేర్‌హామ్, అనుష్క శర్మ, హ్యాపీ కుమారి, కిమ్ గార్త్, యాస్తిక భాటియా, రాజేశ్వరి గైక్వాడ్, జింతిమణి కలిత, జి. కమలిని, ఓర్లా ప్రెండర్‌గాస్ట్, సమైరా రాఘవ్.

ముంబై ఇండియన్స్‌లో భారీ ప్రక్షాళన!

- కోచింగ్ బృందం నుంచి మలింగ, మాంబ్రే, హాప్‌కిన్‌సన్ నిష్క్రమణ
- కొత్త ప్రధాన కోచ్‌గా పొలార్డ్ బాధ్యతల తర్వాత కీలక మార్పులు
- ముంబైతో మలింగ సుదీర్ఘ అనుబంధానికి తెర
- భారత మాజీ బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రేకూ వీడ్కోలు
- ఐపీఎల్ 2027 సీజన్‌కు కొత్త సహాయక బృందం ఏర్పాటుపై దృష్టి

ముంబై, అక్టోబర్ 29: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు సార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు కోచింగ్ విభాగంలో కీలక మార్పులు చేపట్టింది. ఐపీఎల్ 2027 సీజన్‌కు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో బౌలింగ్ కోచ్‌లు లసిత్ మలింగ, పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్సన్ జట్టును వీడుతున్నట్లు ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్ కొత్త ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాబోయే సీజన్‌కు ముంబై ఇండియన్స్ కొత్త సహాయక బృందాన్ని ఏర్పాటు చేసుకునే ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ముంబై ఇండియన్స్ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీలంక మాజీ ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగ జట్టును వీడటం ప్రాధాన్యం సంతరించుకుంది. తన ప్రత్యేకమైన బౌలింగ్ శైలితో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన మలింగ, ముంబై ఇండియన్స్ నాలుగు ఐపీఎల్ టైటిళ్లు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. 2011లో ఛాంపియన్స్ లీగ్ టీ20 విజయంలోనూ తనవంతు సహకారం అందించాడు. ఆటగాడిగా విశేష సేవలందించిన ఆయన ఆ తర్వాత కోచింగ్ విభాగంలోనూ కొనసాగాడు. 2018లో ముంబై ఇండియన్స్‌కు మార్గదర్శకుడిగా వ్యవహరించిన మలింగ, అనంతరం రాజస్థాన్ రాయల్స్ జట్టులో రెండేళ్లపాటు కోచింగ్ బాధ్యతలు నిర్వహించాడు. తొమ్మిదేళ్లపాటు ముంబై బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన షేన్ బాండ్ స్థానంలో 2024 సీజన్‌కు ముందు మళ్లీ ముంబై ఇండియన్స్‌లో చేరాడు. తాజాగా కోచింగ్ బృందం నుంచి ఆయన నిష్క్రమించడంతో ఆటగాడిగా, కోచ్‌గా ముంబైతో కొనసాగిన సుదీర్ఘ అనుబంధానికి ముగింపు పలికినట్లయింది. భారత జట్టు మాజీ ఫాస్ట్ బౌలర్ పరాస్ మాంబ్రే కూడా ముంబై ఇండియన్స్ కోచింగ్ బృందాన్ని వీడుతున్నారు. గతంలో రెండు విడతల్లో ముంబై జట్టుకు సేవలందించిన మాంబ్రే, భారత జాతీయ జట్టు బౌలింగ్ కోచ్‌గా కూడా పనిచేశారు. నవంబర్ 2021 నుంచి జూలై 2024 వరకు టీమిండియా బౌలింగ్ విభాగానికి మార్గదర్శకత్వం వహించారు. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సహాయక సిబ్బందిలో ఆయన ఒకరు. మరోవైపు ఇంగ్లండ్ జట్టు మాజీ ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్‌కిన్‌సన్ కూడా ముంబై ఇండియన్స్ నుంచి నిష్క్రమిస్తున్నారు. 2025 సీజన్‌కు ముందు జట్టులో చేరిన ఆయన ఫీల్డింగ్ విభాగంలో బాధ్యతలు నిర్వహించారు. కోచింగ్ బృందాన్ని వీడుతున్న మలింగ, మాంబ్రే, హాప్‌కిన్‌సన్ సేవలను ముంబై ఇండియన్స్ యాజమాన్యం అభినందించింది. జట్టు విజయాల్లో, ఆటగాళ్ల అభివృద్ధిలో వారు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో వారు చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించింది. మహేల జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ముంబై ఇండియన్స్ సహాయక సిబ్బందిని పునర్‌వ్యవస్థీకరిస్తోంది. బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలకు కొత్త కోచ్‌ల నియామకంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 సీజన్‌లో కొత్త కోచింగ్ బృందంతో బరిలోకి దిగేందుకు ముంబై ఇండియన్స్ సన్నాహాలు చేస్తోంది. ఖాళీ అయిన స్థానాల్లో ఎవరిని నియమిస్తారనే అంశంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

తొలి బంతి నుంచే బాదేందుకు సిద్ధం: తిలక్ వర్మ

ఒత్తిడి బౌలర్‌కే.. నాకు కాదు!

ఆక్లాండ్, అక్టోబర్ 29: చివరి ఓవర్లలో బ్యాటింగ్‌కు దిగినప్పుడు తనపై ఎలాంటి ఒత్తిడి ఉండదని, అసలైన ఒత్తిడి బౌలర్‌పైనే ఉంటుందని భారత టీ20 జట్టు ఉపసారథి తిలక్ వర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జట్టు అవసరాలకు అనుగుణంగా తన బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చుకున్నానని వెల్లడించాడు. గతంలో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి క్రీజులో కుదురుకునేందుకు కొంత సమయం తీసుకునేవాడినని, ఇప్పుడు ఐదు లేదా ఆరో స్థానంలో ఫినిషర్‌గా వస్తుండటంతో తొలి బంతి నుంచే భారీ షాట్లు ఆడేందుకు సిద్ధమవుతున్నానని తెలిపాడు. న్యూజిలాండ్‌తో నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన తిలక్ తన కొత్త పాత్ర, బ్యాటింగ్ వ్యూహాలు, జట్టు లక్ష్యాలపై పలు విషయాలను వెల్లడించాడు. బ్యాటింగ్ స్థానంలో మార్పు తన ఆలోచనా విధానాన్ని మార్చిందని తిలక్ వర్మ తెలిపాడు. మూడో స్థానంలో ఆడేటప్పుడు పరిస్థితులను అర్థం చేసుకుని ఇన్నింగ్స్ నిర్మించేందుకు సమయం ఉండేదని, కానీ ఐదు, ఆరు స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు వేగంగా పరుగులు సాధించాల్సిన అవసరం ఉంటుందని వివరించాడు. అందుకే అవకాశం దొరికితే తొలి బంతినే బౌండరీకి తరలించేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు. పరిస్థితులు అనుకూలించకపోతే సింగిల్స్, డబుల్స్ తీస్తూ మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లేందుకు ప్రాధాన్యం ఇస్తానన్నాడు. తనలో భారీ షాట్లు ఆడే సామర్థ్యం ఎప్పటి నుంచో ఉందని, ప్రస్తుతం దానిని జట్టు అవసరాలకు అనుగుణంగా ఉపయోగిస్తున్నానని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో రెండో టీ20లో కేవలం 26 బంతుల్లో 51 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తిలక్ ఆ ఇన్నింగ్స్‌ను గుర్తుచేసుకున్నాడు. చివరి ఓవర్లలో బ్యాటర్ కంటే బౌలర్‌పైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుందని అభిప్రాయపడ్డాడు. ఒత్తిడిలో ఉన్న బౌలర్ పరుగులు ఇచ్చే అవకాశం ఉంటుందనే సానుకూల దృక్పథంతో బ్యాటింగ్ చేస్తానని తెలిపాడు. ఈ ఆలోచనే క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసంతో ఆడేందుకు ఉపయోగపడుతోందని వివరించాడు. రెండో టీ20లో నితీశ్ రెడ్డితో కలిసి ఏడో వికెట్‌కు 69 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పిన విషయాన్ని తిలక్ ప్రస్తావించాడు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న జట్టును గెలిపించడం ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుందని చెప్పాడు. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి విజయం సాధిద్దామని నితీశ్‌తో చెప్పినట్లు వెల్లడించాడు. ఒత్తిడికి లోనుకాకుండా పరిస్థితులకు అనుగుణంగా ఆడటమే తమ విజయానికి కారణమని వివరించాడు. వెస్టిండీస్‌తో సిరీస్ ముగిసిన వెంటనే న్యూజిలాండ్ పర్యటనకు రావడంతో అక్కడి వాతావరణం, సమయ వ్యత్యాసానికి అలవాటు పడటం సవాలుగా మారిందని తిలక్ తెలిపాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నప్పుడు ఇలాంటి కారణాలను సాకులుగా చూపకూడదని స్పష్టం చేశాడు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు సమావేశంలో చెప్పిన మాటలు ఆటగాళ్లలో స్ఫూర్తి నింపాయని పేర్కొన్నాడు. ఇది సుదీర్ఘ పర్యటన అని, టీ20 జట్టు ప్రదర్శనతో నెలకొల్పే ప్రమాణాలు వన్డే, టెస్టు జట్లకు కూడా ప్రేరణగా నిలవాలని గంభీర్ సూచించినట్లు వివరించాడు. న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ ఇప్పటికే 3--0తో కైవసం చేసుకున్న నేపథ్యంలో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడమే తమ లక్ష్యమని తిలక్ వర్మ స్పష్టం చేశాడు. సిరీస్ గెలిచినంత మాత్రాన సంతృప్తి చెందబోమని, ప్రత్యర్థికి ఒక్క విజయాన్నీ ఇవ్వకుండా 5--0తో సిరీస్‌ను ముగించాలని భావిస్తున్నట్లు తెలిపాడు. శుక్రవారం ఆక్లాండ్ వేదికగా జరగనున్న నాలుగో టీ20లోనూ అదే దూకుడును కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాడు.

విమానాశ్రయంలో సంగక్కరకు చేదు అనుభవం!

ర్యాన్‌ఎయిర్ సిబ్బందిపై వివక్ష ఆరోపణలు

డబ్లిన్ విమానాశ్రయంలో కుటుంబంతో కలిసి అవమానం ఎదుర్కొన్నానని ఆవేదన

డబ్లిన్, అక్టోబర్ 29 : శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ కుమార సంగక్కరకు ఐర్లాండ్‌లోని డబ్లిన్ విమానాశ్రయంలో చేదు అనుభవం ఎదురైంది. ప్రముఖ విమానయాన సంస్థ ర్యాన్‌ఎయిర్ సిబ్బంది తనతోపాటు కుటుంబ సభ్యుల పట్ల వివక్షపూరితంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. విమానం ఎక్కే ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బెదిరింపు ధోరణితో మాట్లాడారని, ప్రయాణ నిబంధనలను అమలు చేసిన తీరు తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తనకు ఎదురైన అనుభవాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష గుర్తింపు పొందిన సంగక్కర విమానయాన సంస్థ సిబ్బందిపై బహిరంగంగా ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. డబ్లిన్ విమానాశ్రయంలో ఇలాంటి అనుభవం ఎదురుకావడం తనకు ఇదే తొలిసారని సంగక్కర పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణిస్తున్న సమయంలో సిబ్బంది వ్యవహరించిన తీరు తమను తీవ్రంగా బాధించిందన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన సిబ్బంది అందుకు విరుద్ధంగా ప్రవర్తించారని ఆరోపించారు. నిబంధనల అమలు పేరుతో ప్రయాణికులను అవమానించేలా మాట్లాడటం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడ్డారు. తన కుటుంబ సభ్యులు కూడా ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడం మరింత బాధ కలిగించిందని వెల్లడించారు. సంగక్కర చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. ఆయన పోస్టుపై డబ్ల్యూఎస్‌ఓ2 సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి సంజీవ వీరవర్ణ స్పందించారు. పాశ్చాత్య దేశాల్లోని పలు ప్రాంతాల్లో తాను కూడా వివక్షను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై సంగక్కర స్పందిస్తూ, అలాంటి అనుభవం స్వయంగా ఎదురైనప్పుడు కలిగే బాధ తీవ్రంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రయాణికుల పట్ల విమానయాన సంస్థల సిబ్బంది వ్యవహరించే తీరుపై ఈ ఘటనతో మరోసారి చర్చ మొదలైంది. సంగక్కర చేసిన వివక్ష ఆరోపణలపై ర్యాన్‌ఎయిర్ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, సిబ్బంది వివరణ, నిబంధనల అమలుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంగక్కర ఆరోపణలపై విమానయాన సంస్థ ఎలాంటి వివరణ ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

అత్యంత విలువైన ఐపీఎల్ ఫ్రాంచైజీగా ముంబై

ప్రతి ఫ్రాంచైజీ విలువ రూ.14,000 కోట్లకు పైనే!

ప్రపంచ క్రీడా యవనికపై ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తన అపారమైన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. తాజాగా ప్రముఖ సంస్థ 'స్పోర్టికో' విడుదల చేసిన నివేదిక ప్రకారం, ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ 2.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.20,008 కోట్లు) అద్భుతమైన విలువతో ప్రపంచంలోనే అత్యంత విలువైన ఐపీఎల్ జట్టుగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదిక ఆధారంగా ఐపీఎల్‌లోని ప్రతి ఫ్రాంచైజీ విలువ ప్రస్తుతం కనీసం 1.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.14,292 కోట్లు) మైలురాయిని దాటడం విశేషం. బ్రాండ్ విలువ పరంగా ముంబై ఇండియన్స్ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 1.85 బిలియన్ డాలర్లతో (రూ.17,626 కోట్లు) రెండో స్థానంలో నిలవగా, చెన్నై సూపర్ కింగ్స్ 1.75 బిలియన్ డాలర్లతో (రూ.16,674 కోట్లు) మూడో స్థానంలో నిలిచింది. కోల్‌కతా నైట్ రైడర్స్ 1.73 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో ఉండగా, ఢిల్లీ క్యాపిటల్స్ 1.7 బిలియన్ డాలర్లతో లీగ్ సగటు విలువకు సమానంగా నిలిచింది. మిగతా జట్లలో రాజస్థాన్ రాయల్స్ (1.65 బిలియన్ డాలర్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (1.62 బిలియన్ డాలర్లు), గుజరాత్ టైటాన్స్ (1.58 బిలియన్ డాలర్లు), పంజాబ్ కింగ్స్ (1.53 బిలియన్ డాలర్లు) వరుస తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైన నాటి నుంచి ఫ్రాంచైజీల వ్యాపార విలువలో అసాధారణ వృద్ధి నమోదైంది. గత 18 ఏళ్ల కాలంలో లీగ్ ఫ్రాంచైజీల విలువ ఏకంగా 1,800% పెరిగింది. ఇదే సమయంలో అమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ స్పోర్ట్స్ లీగ్‌లైన ఎన్‌ఎఫ్‌ఎల్ (800%), ఎన్‌బీఏ (1700% లోపు) వృద్ధి రేటు కంటే ఇది చాలా ఎక్కువ కావడం గమనార్హం. ముంబై ఇండియన్స్ మార్కెట్ విలువ కొన్ని ఉత్తర అమెరికా స్పోర్ట్స్ ఫ్రాంచైజీలైన డెట్రాయిట్ టైగర్స్, వాంకోవర్ కానక్స్ కంటే అధికంగా ఉండటం ఐపీఎల్ బ్రాండ్ ప్రాభవాన్ని స్పష్టం చేస్తోంది. ఐపీఎల్ జట్లకు ప్రధాన ఆదాయ వనరు బీసీసీఐ నుంచి వచ్చే సెంట్రల్ రెవెన్యూ పూల్. ముఖ్యంగా బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియా హక్కుల ద్వారా బీసీసీఐకి భారీ ఆదాయం సమకూరుతుంది. ఇందులో సగం వాటాను బోర్డు ఉంచుకుని, మిగిలిన మొత్తంలో దాదాపు 90% అన్ని ఫ్రాంచైజీలకు సమానంగా పంచుతుంది. మరో 10% జట్ల ప్రదర్శన ఆధారంగా లభిస్తుంది. దీని ద్వారా ప్రతి ఫ్రాంచైజీకి ఏటా సుమారు 50–55 మిలియన్ డాలర్లు (రూ.476 కోట్ల నుంచి రూ.523 కోట్ల వరకు) అందుతాయి. ఇవి కాకుండా టికెట్ల అమ్మకాలు, స్పాన్సర్‌షిప్‌లు, వాణిజ్య భాగస్వామ్యాల ద్వారా కూడా జట్లు అదనపు రాబడిని పొందుతున్నాయి. ఆటగాళ్ల వేలం పరిమితులు, నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటంతో 30% కంటే ఎక్కువ లాభాల మార్జిన్‌తో ఐపీఎల్ జట్లు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడులుగా మారాయి.

పింక్ డ్రెస్‌లో నిధి అగర్వాల్

సింపుల్ లుక్‌లోనూ స్పెషల్ అట్రాక్షన్!

నటి నిధి అగర్వాల్ తన ఫ్యాషన్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. తాజాగా పింక్ రంగు దుస్తుల్లో కనిపించి తనదైన స్టైల్‌తో అభిమానులను అలరిస్తోంది. సింపుల్‌గా కనిపిస్తూనే అందంగా మెరిసిపోతున్న ఆమె లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నిధి ధరించిన పింక్ హాల్టర్ నెక్ డ్రెస్ అందంగా ఉంది. మెడ దగ్గర చిన్న బో, ప్లీటెడ్ డిజైన్‌తో కూడిన పైభాగం, కిందివైపు పొరలుగా జారే స్కర్ట్, అంచుల్లో రఫుల్స్ ఆమె దుస్తులకు ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చాయి. వదులుగా వదిలిన ఉంగరాల జుట్టు, చిన్న హూప్ చెవిపోగులతో తన రూపాన్ని మరింత సింపుల్‌గా తీర్చిదిద్దుకుంది. వెనుకవైపు తెల్లటి తెరల మధ్య నుంచి పడుతున్న సూర్యకాంతి ఫొటోలకు ఆహ్లాదకరమైన రూపాన్ని ఇచ్చింది. ఇదిలా ఉంటే, నిధి అగర్వాల్ కెరీర్ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ది రాజా సాబ్ సినిమాకు ఆశించిన స్థాయిలో ఓపెనింగ్ లభించకపోవడంతో, ప్రస్తుతం ఆమె చేతిలో మరో సినిమా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ముగిసేలోగా నిధికి కొత్త సినిమా అవకాశం వస్తుందేమో చూడాలి.

అందంతో కట్టిపడేస్తూ!

ఎమరాల్డ్ గ్రీన్ శారీలో అనుపమ పరమేశ్వరన్..

తనదైన అందం, ప్రత్యేకమైన ఫ్యాషన్ ఎంపికలతో అభిమానులను ఆకట్టుకునే నటి అనుపమ పరమేశ్వరన్ మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. తాజాగా ఎమరాల్డ్ గ్రీన్ రంగు కార్సెట్ శారీలో చేసిన ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. సంప్రదాయ చీరకట్టుకు ఆధునిక హంగులు జోడించిన ఆమె లుక్ అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ ఫొటోషూట్‌లో అనుపమ ఆకుపచ్చ రంగు కార్సెట్ బ్లౌజ్‌తో పాటు డ్రేప్డ్ స్కర్ట్ తరహాలో చీరను ధరించింది. చీర కొంగుపై బంగారు రంగు ఆకుల ముద్రణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్సెట్ ముందు భాగంలో చంద్రవంక ఆకారంలో ఉన్న చిన్న బటన్లు ఆమె దుస్తులకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. బంగారు రంగు చోకర్ నెక్లెస్, జుంకాలు, చేతినిండా గాజులతో అనుపమ తన లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దుకుంది. వదులుగా వదిలిన ఉంగరాల జుట్టు, వింగ్డ్ ఐలైనర్, చిన్న బిందీ ఆమె అందానికి అదనపు ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ, ఆధునిక శైలుల కలయికతో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇక సినిమాల విషయానికొస్తే.. అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం శర్వానంద్, డింపుల్ హయాతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'భోగి' చిత్రంలో కనిపించనుంది. ఈ సినిమా ఈ ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తోంది ఈ ముద్దుగుమ్మ

ఆ పాత్ర కోసం ప్రాణం పణంగా పెట్టా: రెజీనా కసాండ్రా

'మూకుత్తి అమ్మన్ 2'లో భైరవి అనే నెగెటివ్ రోల్‌లో నటిస్తున్నట్లు వెల్లడి

నయనతారతో తన సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పిస్తాయని వ్యాఖ్య

నటి రెజీనా కసాండ్రా తన సినీ కెరీర్‌లో తొలిసారిగా ఒక పూర్తిస్థాయి కమర్షియల్ విలన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రంలో తాను పోషించిన 'భైరవి' అనే పవర్‌ఫుల్ నెగెటివ్ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించానని ఆమె అన్నారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రెజీనా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ సి పై రెజీనా ప్రశంసలు కురిపించారు. "గత 30 ఏళ్లుగా తమిళ చిత్ర పరిశ్రమలో ఉంటూ, ఇతర పరిశ్రమలకు వెళ్లకుండానే తమిళ సినిమాను పాన్-ఇండియా స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి సుందర్ సి. అలాంటి దర్శకుడి సినిమాలో ఇంత బలమైన విలన్ పాత్ర లభించడం సంతోషంగా ఉంది. ఇందులో నయనతారతో నా ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి" అని ధీమా వ్యక్తం చేశారు. 2020లో ఘన విజయం సాధించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతోంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ డివోషనల్ కామెడీ చిత్రాన్ని ఇషారి కె. గణేశ్ నిర్మించారు. ఇందులో నయనతార, ఖుష్బూ, స్నేహ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా పూజ నుంచి ప్రీ-రిలీజ్ ఈవెంట్ వరకు ప్రతీది ఎంతో గ్రాండ్‌గా నిర్వహించిన నిర్మాత ఇషారి కె. గణేశ్ కు రెజీనా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి భారీ బడ్జెట్ మహిళా ప్రాధాన్య చిత్రాలు నిర్మించడం తనలాంటి ఎందరో నటీమణులకు కొత్త ఆశను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని, కథను నమ్మి ముందుకొచ్చే నిర్మాతలకు అందరూ మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

భారత సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన సినిమా

ఐదు దేశాల జీడీపీ కంటే 'రామాయణ' బడ్జెట్ ఎక్కువ!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మరో అత్యంత భారీ ప్రాజెక్ట్ సరికొత్త ప్రపంచ సంచలనాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ప్రముఖ దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వంలో, పవిత్ర హిందూ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమా బడ్జెట్ వివరాలు సినీ వర్గాలను, ప్రేక్షకులను విస్తుపోయేలా చేస్తున్నాయి. బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, కన్నడ రాకింగ్ స్టార్ యశ్ రావణాసురుడిగా నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్ర ఫ్రాంచైజీ బడ్జెట్ అక్షరాలా రూ.4,000 కోట్లుగా ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ భారీ మొత్తం ఐదు పసిఫిక్ ద్వీప దేశాల వార్షిక స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) కంటే అధికం కావడం గమనార్హం. ఈ పౌరాణిక చిత్రం రెండు భాగాలుగా అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు భాగాల నిర్మాణ వ్యయంతో పాటు ప్రపంచవ్యాప్త ప్రచార కార్యక్రమాలు, హాలీవుడ్ స్థాయి గ్లోబల్ మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ ఖర్చులను కలిపి ఈ స్థాయిలో భారీ బడ్జెట్‌ను కేటాయించినట్లు సమాచారం. చిత్రంలో రావణుడి ప్రతికూల పాత్ర పోషిస్తూ, నిర్మాణంలో భాగస్వామిగా (సహ నిర్మాతగా) వ్యవహరిస్తున్న నటుడు యశ్ ఈ వ్యవహారంపై స్పష్టతనిచ్చారు. ఇది కేవలం సెట్ల నిర్మాణానికి లేదా నటీనటులకు అయ్యే ఖర్చు మాత్రమే కాదని, భారతీయ సినిమాని ప్రపంచ మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలిపేందుకు పక్కా ప్రణాళికతో చేస్తున్న అంతర్జాతీయ స్థాయి పెట్టుబడి అని ఆయన వివరించారు. ఈ సినిమా బడ్జెట్ ఎంత విస్మయకరమైనదో అర్థం చేసుకోవడానికి కొన్ని చిన్న దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోల్చి చూడాల్సి ఉంటుంది. ఈ ఒక్క సినిమా బడ్జెట్ ఐదు పసిఫిక్ ద్వీప దేశాల 2026 నామమాత్రపు జీడీపీ అంచనాల కంటే చాలా ఎక్కువ. ఉదాహరణకు తువాలు (సుమారు రూ.750 కోట్లు), నౌరు (రూ.1,764 కోట్లు), మార్షల్ ఐలాండ్స్ (రూ.3,078 కోట్లు), పలావు (రూ.3,357 కోట్లు), కిరిబాటి (రూ.3,618 కోట్లు) దేశాల మొత్తం జీడీపీ విలువలు ఈ సినిమా బడ్జెట్ కంటే తక్కువగా ఉండటం విశేషం. ఒక దేశంలో పూర్తి సంవత్సరంలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల విలువ ఆధారంగా జీడీపీని పరిగణిస్తారు. భారతదేశంలో ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్‌తో నిర్మితమైన 'కల్కి 2898 ఏడీ', 'ఆర్ఆర్ఆర్' వంటి రికార్డు సినిమాలను కూడా 'రామాయణ' పూర్తిగా అధిగమించనుంది. రెండు భాగాల ప్రాజెక్ట్‌గా పరిశీలిస్తే, ఇది భారతదేశంలోనే అత్యంత ఖరీదైన ఫిల్మ్ ఫ్రాంచైజీగా సరికొత్త చరిత్ర సృష్టించనుంది. మొత్తం మీద 'రామాయణ' కేవలం ఒక వినోదాత్మక చిత్రంగానే కాకుండా, భారతీయ సినిమా ప్రపంచ రంగానికి విస్తరిస్తున్న ఆర్థిక సామర్థ్యానికి, ప్రామాణికతకు ఒక గొప్ప నిదర్శనంగా నిలుస్తోంది.

తుపాను బాధితులకు సంఘీభావం

- 'కల్ట్' ప్రీ-రిలీజ్ ఈవెంట్ రద్దు
- ఏపీలో అర్నాబ్ తుపాను బీభత్సం
- కష్టకాలంలో వేడుకలు సరికాదన్న హీరో విష్వక్ సేన్
- అక్టోబర్ 30న సినిమా విడుదల యథాతథం

టాలీవుడ్ యువ నటుడు విష్వక్ సేన్ తన రాబోయే చిత్రం 'కల్ట్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌ను 'అర్నాబ్' తుపాను అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో, బాధితులకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈరోజు ఈ వేడుకను రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో అర్నాబ్ తుపాను ఎలాంటి విధ్వంసం సృష్టిస్తోందో అందరికీ తెలుసు. ఇలాంటి కష్టకాలంలో మనం బాధితులకు అండగా నిలవాలి. ఇప్పుడు వేడుకలు నిర్వహించడం సరికాదని భావించి ఈవెంట్‌ను రద్దు చేస్తున్నాం. మనమంతా ఏపీకి అండగా నిలవాలి" అని విష్వక్ సేన్ పేర్కొన్నారు. అయితే, ప్రీ-రిలీజ్ ఈవెంట్ మాత్రమే రద్దు చేశామని, సినిమా ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు ఒక ప్రెస్ మీట్ నిర్వహించి, 'కల్ట్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇక ఈ చిత్రం ముందుగా ప్రకటించినట్లుగానే అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని చిత్రబృందం స్పష్టం చేసింది.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

గంజాయి సాగు, రవాణాను అరికట్టాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: జిల్లా మాదక ద్రవ్యాల రవాణా, గంజాయి సాగు, రవాణాను అరికట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్ కార్ మాదకద్రవ్యాలను నియంత్రణపై నిర్వహించిన సమావేశానికి జిల్లా ఎస్.పి. నితికాపంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, గంజాయి సాగు, రవాణా అరికట్టడంలో అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సాగు, రవాణాకు సంబంధించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించాలని తెలిపారు. హోటళ్ళు, దాబా లలో తనిఖీలు చేపట్టాలని, మందుల షాపులలో నిషేధిత, అధిక మోతాదు మందులను పరిశీలించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా పాఠశాలలు, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి తంబాకు రహిత విద్యాసంస్థలుగా మార్చాలని తెలిపారు. జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ ఈ అక్టోబర్ నెలలో గంజాయి సాగు, రవాణాపై తనిఖీలు చేపట్టి 16 కేసులు నమోదు చేయడం జరిగిందని, గంజాయి సాగు చేసే వారికి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గంజాయి సాగు, రవాణా, మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా మాధ్యమిక విద్యాధికారి కళ్యాణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు లేకుండానే రహదారి మళ్లింపు

- కొత్త రోడ్డు వద్ద వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారుల డిమాండ్

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: సత్తుపల్లి నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన రహదారిపై సింగరేణి బొగ్గు గనుల కారణంగా ఇటీవల రహదారి మళ్లింపు చేపట్టారు. అయితే కొత్త రహదారి పనులు పూర్తి కాకముందే వాహనాల రాకపోకలను మళ్లించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సత్తుపల్లి నుంచి విజయవాడ వెళ్లే మార్గంలోని మొదటి మలుపు వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది.

రహదారిలో కొంత భాగం మాత్రమే పూర్తికావడంతో పాటు, రాత్రి వేళల్లో మలుపు వద్ద లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపు వద్ద వెలుతురు లేకపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనే ప్రమాదం పొంచి ఉంది. చీకట్లో మలుపు సరిగా కనిపించకపోవడం, ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడం కష్టంగా మారడంతో ప్రమాద భయం నెలకొంది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మళ్లింపు చేపట్టే ముందు అవసరమైన భద్రత చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, కనీస వెలుతురు సదుపాయం లేకపోవడంపై వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సత్తుపల్లి నుంచి విజయవాడ వెళ్లే మార్గంలోని మొదటి మలుపు వద్ద వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, అవసరమైన సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఆరు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- రైతులు ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి: ఏఎంసీ చైర్మన్ హమీద్

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: మండలంలోని ఆరు గ్రామాల్లో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సముద్ర లింగాపూర్, గోరంటాల, గజ సింగవరం, మల్లుపల్లె, లక్ష్మీపూర్, దామన్నపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని ఏఎంసీ చైర్మన్ హమీద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని తమ పంటకు గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. మధ్య దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రైతులకు మద్దతు ధర అందించడమే లక్ష్యంగా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వేశాల వెంకటి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు

కొండూరి గాంధీరావు, పర్శ హన్మాండ్లు, వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మేడ భాస్కర్, ఆయా గ్రామాల సర్పంచులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ధాన్యం జిల్లాలోకి రాకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు

జిల్లా అదనపు కలెక్టర్ రాములు

ఉద్యమ కెరటం, మంచిర్యాల: ఖరీఫ్ 2026–27 సీజన్‌లో ధాన్యం కనీస మద్దతు ధర కొనుగోళ్ల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోకి అక్రమంగా రాకుండా కట్టడి చేసేందుకు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తెలిపారు. కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామ సమీపంలోని లక్ష్మీపూర్ వద్ద ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర సరిహద్దులోని సిరోంచా ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాల ధాన్యం జిల్లాలోకి అక్రమంగా రాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులకు షిఫ్టుల వారీగా విధులు కేటాయించినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. జైపూర్ ఏసీపీ, జిల్లా వ్యవసాయ అధికారి, కోటపల్లి తహశీల్దార్ సమన్వయంతో చెక్‌పోస్టు సిబ్బంది విధులను పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌లు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యం వాహనాలను జిల్లాలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాల ధాన్యం చేరకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల ధాన్యం గుర్తించినట్లయితే దాన్ని స్వాధీనం చేసుకోవాలని, సంబంధిత రైతులకు ఎలాంటి చెల్లింపులు చేయరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తూ స్థానిక రైతులకు కనీస మద్దతు ధర అందేలా చూడాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

నిబంధనల ప్రకారం భూముల క్రమబద్ధీకరణ చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, అర్హత కలిగిన దరఖాస్తులను మాత్రమే నిబంధనల మేరకు పరిశీలించాలని సూచించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జీఓ నంబర్ 59, 76 అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, సింగరేణి భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలు, అర్హతలు, గడువులకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత కటాఫ్

తేదీకి ముందుగా జరిగిన ఆక్రమణలకు సంబంధించి, జీఓలోని నిబంధనల ప్రకారం అర్హత ఉన్న సందర్భాల్లోనే క్రమబద్ధీకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. భూముల క్రమబద్ధీకరణకు ముందు సంబంధిత భూములు అటవీ భూముల పరిధిలోకి వస్తాయా అనే అంశాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అటవీ చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, అన్ని అంశాలను నిర్ధారించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీఓ నంబర్ 59 ప్రకారం 500 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి నిర్దేశించిన అర్హతలు, నిబంధనలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. జీఓ నంబర్ 76 అమలులో భాగంగా తహశీల్దార్లు, సింగరేణి అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు కానివారు సింగరేణి క్వార్టర్లలో నివసిస్తే నిబంధనల ప్రకారం వాటిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగరేణి నిర్మాణాల్లో నివసిస్తున్న వారికి మున్సిపాలిటీల ద్వారా ఆస్తి పన్ను విధించడం, ఇంటి నంబర్లు కేటాయించడం వంటి అంశాలను పరిశీలించాలని అన్నారు. ఈ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా చర్యలు చేపట్టినట్లు గుర్తిస్తే సంబంధిత మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, సింగరేణి అధికారులు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీ గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థి

ఉద్యమ కెరటం, తాండూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే హాస్టల్ నుంచి ఓ విద్యార్థి పారిపోయాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఒక బాలుడు బుధవారం రాత్రి హాస్టల్ నుంచి పారిపోయాడు. విద్యార్థి పారిపోయిన విషయాన్ని హాస్టల్ సిబ్బంది ఉదయం బాలుడి తల్లిదండ్రులకు తెలుపగా వారు హాస్టల్ కు చేరుకున్నారు. అప్పటికే ఆ విద్యార్థి వారి ఇంటికి వెళ్లినట్లు తల్లిదండ్రులకు సమాచారం వచ్చింది. అయితే బాలుడు పారిపోయిన విషయం బయటకు రానివ్వకుండా దాచడం అనుమానాలకు దారి తీస్తుంది. సిబ్బంది సరిగ్గా చూడకపోవడంతోనే ఇలాంటి ఘటన జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మహాత్మ జ్యోతిబా పూలే హాస్టల్ లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

తండ్రి అంత్యక్రియల్లో కుండ పట్టుకుని నడిచిన ఐదేళ్ల బాలుడు

కంటతడి పెట్టించిన హృదయవిదారక దృశ్యం

ఉద్యమ కెరటం, తాండూర్: తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో విషాదం చోటు చేసుకుంది. మాదారం టౌన్‌షిప్‌కు చెందిన పుట్ట రాజేంద్ర ప్రసాద్ (35) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఆయన మరణంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అయితే తండ్రి మరణం అంటే ఏమిటో కూడా పూర్తిగా తెలియని వయసులో ఉన్న ఆయన ఐదేళ్ల కుమారుడు పుట్ట దేవాన్ష్ అందరినీ కంటతడి పెట్టించాడు. ఎల్‌కేజీ చదువుతున్న ఈ చిన్నారి తండ్రి అంత్యక్రియల సమయంలో కుండ పట్టుకుని పాడె ముందు నడిచాడు. అనంతరం చితిపై కట్టెలు పేర్చిన తర్వాత తండ్రి మృతదేహానికి నిప్పంటించాడు. లోకజ్ఞానం తెలియని పసి వయసులోనే తండ్రికి తలకొరివి పెట్టాల్సిన పరిస్థితి రావడం అక్కడికి వచ్చిన వారిని కలచివేసింది. తండ్రిని కోల్పోయిన ఆ చిన్నారిని చూసి పలువురు దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు. ఈ హృదయవిదారక దృశ్యం అక్కడున్న వారందరినీ కన్నీటి పర్యంతం చేసింది. ఐదేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయిన దేవాన్ష్ ను చూసి స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి పలువురు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వరుస చోరీలకు పాల్పడిన ఐదుగురు అరెస్ట్

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో 12 చోరీ కేసులు

50 కిలోల ఇత్తడి, నాలుగు వాహనాలు స్వాధీనం

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడిన ఐదుగురు నిందితులను ఆదిలాబాద్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు బాల నేరస్థులు ఉన్నట్లు రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు. నిందితులు ఆలయాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడటంతో పాటు ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు, దుకాణాల్లోని వస్తువులను అపహరించినట్లు పేర్కొన్నారు. మొత్తం 12 చోరీ ఘటనల్లో వీరి ప్రమేయాన్ని గుర్తించినట్లు చెప్పారు. నిందితుల నుంచి 50 కిలోల ఇత్తడి సామాగ్రి, నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లు, రూ.8వేల నగదుతో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై వి.విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుల నియామకం

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పట్టణ, గ్రామ శాఖ అధ్యక్షులను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నియమితులైన అధ్యక్షులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు.

గ్రామాల వారీగా నియమితులైన అధ్యక్షులు..

గంభీరావుపేట పట్టణంలో నల్ల రాజ్ కుమార్, మల్లుపల్లె మరాటి భూదయ్య, గజ సింగవరం బనావత్ సతీష్, రాజేశ్వర్ రావు నగర్ పల్లపు రాములు, జగదాంబ తండా భూక్య మోహన్,నర్మాల రాగుల మహేందర్, కొల్లమద్ది భూపతి మైపాల్,నాగంపేట నర్ర పద్మారెడ్డి, పొన్నాలపల్లి సుమలత, లింగన్నపేటలో అల్లెపు రమేష్, రాజుపేట దిండి నవీన్, దేశాయిపేట జక్కుల నర్సయ్య, మల్లారెడ్డిపేటలో బిచ్చాల రాజ్ రెడ్డి, గోరంటాల రుద్రోజి భాస్కర్, కొత్తపల్లి చింతల అనిల్, శ్రీగాధ కత్తుల చంద్రం, ముచ్చర్ల తండా మాలోత్ ఆంజనేయులు, సముద్రలింగాపూర్ బొల్లి మల్లేశం, దమ్మన్నపేట అక్కల చంద్ర గౌడ్, ముస్తఫానగర్ శివంది దేవేందర్ నియమితులయ్యారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి

జైనూర్ ఎస్సై రవికుమార్

ఉద్యమ కెరటం, జైనూర్: ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జైనూర్ ఎస్సై రవికుమార్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. రక్తదానం చేయడంతో ఆరోగ్యానికి హాని కలుగుతుందనే అపోహలను ప్రజలు వీడ నాడాలని సూచించారు. రక్తదానం ద్వారా అత్యవసర సమయంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత రక్తదానంపై అవగాహన పెంచుకుని, స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. రక్తదానంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 30న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్పీ ఆదేశాల మేరకు మెగా రక్తదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండలానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై బాబర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంద్రవెల్లిలో తెలంగాణ రక్షణ సేన 'పాంచజన్య' సభ

- సభ ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర బృందం, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపూరావు

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న 'పాంచజన్య సంకల్ప బహిరంగ సభ'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరుకానుండటంతో సభపై ఆసక్తి నెలకొంది. సభకు సంబంధించి గురువారం ఆ పార్టీ రాష్ట్ర బృందం జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుతో కలిసి సభ ప్రాంగణాన్ని సందర్శించారు. వేదిక ఏర్పాటు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి స్థానిక నాయకులతో సమీక్షించారు. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఈ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇంద్రవెల్లి వేదికగా నిర్వహించనున్న ఈ సభలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల చేసే ప్రసంగంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పార్టీ లక్ష్యాలు, ప్రజా సమస్యలపై వైఖరి, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి ఆమె ఎలాంటి అంశాలను వెల్లడిస్తారనే చర్చ సాగుతోంది.

తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

జీపీఓ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ పట్టివేత



ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. మోసం గ్రామ పంచాయతీ అధికారి (జీపీఓ) గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఓ పని నిమిత్తం ఒక వ్యక్తి దగ్గర నుంచి రూ.22వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ విషయమై బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు వల పన్ని కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా శ్రీనివాస్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ ఘటనతో కాగజ్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. అధికారులు జీపీఓను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆరోగ్య పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: జిల్లాలో వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రజలందరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని నాగోబా విద్యార్థి నిలయంలో శంకర నేత్రాలయ హైదరాబాద్, వనవాసీ కళ్యాణ్ పరిషత్ (తెలంగాణ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్సల ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఐటీడీఏ పీఓ మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పీఓ వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే వ్యవసాయం, చదువు, వ్యాపారాలు, ఇలా అన్నిరంగాల్లో రాణించవచ్చని తెలిపారు. ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేవలం తీవ్రమైన అనారోగ్య సమయాల్లోనే, చివరి దశలో ఆర్ఎంపీల వద్దకు వెళ్లే ధోరణిని మార్చుకోవాలని, ప్రాథమిక దశలోనే అర్హులైన ప్రభుత్వ వైద్య నిపుణులను కలవాలని స్పష్టం చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా అక్టోబర్ 31 వరకు కంటి పరీక్షలు నిర్వహించి, నవంబర్ 1 వరకు కంటి ఆపరేషన్లు కొనసాగుతున్నాయని వివరించారు. కేవలం కంటి పరీక్షలు, ఆపరేషన్లే కాకుండా, అవసరమైన వారికి తదుపరి సేవలు సైతం ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతో ప్రయోజనకరమని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఓ మంద మకరందు మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి మొబైల్ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రత్యేక కంటి వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న సామాన్యులకు ఈ శిబిరాలు గొప్ప అవకాశమని, ప్రజలు ఆరోగ్యంపై మరింత చైతన్యం కలిగి ఉండాలని అన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఇప్పటివరకు 568 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 150 మందిని కంటి పొర ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగిందని, 60 మందికి ఆపరేషన్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ్ పరిషత్ కార్యకర్తలు సిడామ్ భీమ్ రావు, హెచ్.కె.నాగు, ప్రకాష్, అజయ్, శంకర నేత్రాలయ కోఆర్డినేటర్ రాజు, వైద్యులు, స్థానిక సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. గురువారం పోతుగల్, లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలు, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. కుష్ఠు వ్యాధి గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఎల్‌సీడీసీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, ఇంటింటి సర్వే ద్వారా అనుమానితులను గుర్తించి నిర్ధారణ పరీక్షలు, చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. గర్భిణీలను ముందుగానే నమోదు చేసి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. క్షయ వ్యాధి అనుమానితులను ముందుగానే గుర్తించి పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి పూర్తిస్థాయి చికిత్స అందిస్తూ క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. దోమల నివారణకు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మధుమేహం, రక్తపోటు వంటి అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు నిరంతరం స్క్రీనింగ్ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం గంభీరావుపేటలోని ఆదిత్య, ఎస్ఆర్ ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ, అనుమతులు, చట్టపరమైన నిబంధనల అమలును పరిశీలించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినట్లు గుర్తిస్తే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలు, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ హాఫీజ, డాక్టర్ గీతాంజలి, మహేష్ గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాండూర్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఉద్యమ కెరటం, తాండూర్: ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నష్టపరిహారం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఆహార పంటలకు ఎకరాకు రూ.30వేల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. గురువారం తాండూర్ మండలంలో సీపీఎం రాష్ట్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రూ.50వేల కోట్ల నిధులు కేటాయించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలో 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ తాండూర్ మండలాన్ని విస్మరించారని పేర్కొన్నారు. తాండూర్‌ను కూడా కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. కరువు పరిస్థితులతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని, ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, భూపాల్, ఎంవి.రమణ, ఆశన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు నగేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బోడంకి చందు, జిల్లా కార్యదర్శి గోమాస ప్రకాష్, గుమాస అశోక్, దాగం రాజారాం, తాండూర్ మండల కార్యదర్శి సాంబార్ వెంకటస్వామి, దాగం శ్రీకాంత్, పాయిరాల రాములు, దుర్గం నాన్నయ్య, బొల్లం రాజేశం, కొమ్మ రాజయ్య, రైతులు, కౌలుదారులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

ఉద్యమ కెరటం, సిర్పూర్(యు): అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మేరా యువ భారత్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం సిర్పూర్(యు) మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షేక్ మజీద్ ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు జీవితంలోని అన్ని రంగాల్లో నీతి, నిజాయితీ, చట్టబద్ధ పాలనను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం చేయబోమని, ప్రతి పనిని పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ, అవినీతికి సంబంధించిన ఘటనలు ఎదురైనప్పుడు వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. యువత సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కనకా ఆనంద్, పటేల్ శ్రీరామ్, ఉపసర్పంచ్ రామారావు, సామాజిక కార్యకర్త ఆరిఫ్, యూత్ అధ్యక్షుడు ఆత్రం హనుమంతరావు, సుధాకర్, జూగాది రావు, బాపు రావు, దేవు రావు, బల్లు తదితరులు పాల్గొన్నారు.

36 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు

- లింగూడ ప్రాథమిక పాఠశాలకు మరో టీచర్‌ను నియమించాలి

ఉద్యమ కెరటం, కెరమెరి: మండలంలోని లింగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 36 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యా బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో ఉపాధ్యాయుడిని వెంటనే నియమించాలని సర్పంచ్ రోజాతో పాటు గ్రామస్తులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడే బోధించాల్సి రావడంతో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం కష్టంగా మారుతోందని చెబుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే అదనపు ఉపాధ్యాయుడిని నియమించడం అవసరమని తెలిపారు. విద్యా శాఖ అధికారులు సమస్యను గుర్తించి లింగూడ ప్రాథమిక పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకుని మెరుగైన విద్యాబోధన అందించాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఉద్యమ కెరటం, సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 6,465 ఇళ్లకు ముగ్గు పోశారని, 5,479 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయికి, 4,858 ఇళ్లు గోడల స్థాయికి, 4,585 ఇళ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. మరో 3,934 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. ముగ్గు పోసిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లను గోడల స్థాయికి, అక్కడి నుంచి స్లాబ్ స్థాయికి తీసుకెళ్లేలా పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న వారికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించి పూర్తి చేయించాలని స్పష్టం చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పురోగతిని కూడా ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రతి ఎంపీడీఓ క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించాలని, నిర్మాణ పురోగతికి సంబంధించిన ఫొటోలను హౌసింగ్ ఏఈలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయం జమ అవుతోందని పేర్కొన్నారు. లబ్ధిదారులతో ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు

సమావేశాలు నిర్వహించి, నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ఉత్తమ పనితీరు కనబర్చిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఖాజా ముజాఫరుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్మాలలో 14 ఏళ్ల బాలుడు అదృశ్యం

పోలీసులకు ఫిర్యాదు

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: మండలంలోని నర్మాల గ్రామానికి చెందిన 14 ఏళ్ల మహమ్మద్ రెహాన్ అనే బాలుడు అదృశ్యమయ్యాడు. కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనకు గురైన తండ్రి మహమ్మద్ అబ్దుల్ రజాక్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పెట్రోల్ బంకులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న అబ్దుల్ రజాక్‌కు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన రెహాన్ కామారెడ్డిలోని మదర్సా అరేబియా కాశీఫుల్ ఉలూం పాఠశాలలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 18న తండ్రి బాలుడిని పాఠశాల వద్ద వదిలిపెట్టాడు.

అయితే మరుసటి రోజు ఇంటికి తిరిగి వచ్చిన రెహాన్ అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో అక్టోబర్ 25న ఉదయం 11.30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసినవారి వద్ద విచారించారు. బాలుడు చదువుతున్న పాఠశాల నిర్వాహకులను సంప్రదించినప్పటికీ ఆచూకీ లభించలేదు. తన కుమారుడిని ఎవరైనా అపహరించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేసిన తండ్రి, బాలుడి ఆచూకీ కనుగొని తమకు అప్పగించాలని పోలీసులను కోరాడు. బాలుడి ఆచూకీ తెలిసినవారు సంబంధిత పోలీసులకు సమాచారం అందించి కుటుంబ సభ్యులకు సహకరించాలని కోరుతున్నారు.

బాలల భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.సౌజన్య

ఉద్యమ కెరటం, సిద్దిపేట: విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం–2012 గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.సౌజన్య సూచించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.సుదర్శన్ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇబ్రహీంనగర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ, గోనేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే చట్టపరమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఆన్‌లైన్ వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని తెలిపారు. బాలల భద్రతను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల సైకియాట్రిస్ట్ డాక్టర్ కె.షణ్ముఖ ప్రియ, సైబర్ క్రైమ్ ఎస్సై దివ్య, చైల్డ్ ప్రొటెక్షన్ వింగ్ ప్రతినిధి ఎన్.గణేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.సతీష్ కుమార్, జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ హెడ్‌మాస్టర్ కె.రాములు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

ఉద్యమ కెరటం, కామారెడ్డి: గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ అంకితభావంతో కృషి చేస్తోందని కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గురువారం కామారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా గాంధారి, రామారెడ్డి మండలాల్లోని గిరిజన తండాలను సందర్శించారు. గిరిజనులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తండాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమం, గృహ నిర్మాణం, వైద్యం, పంచాయతీరాజ్, రహదారులు, అటవీ, రెవెన్యూ, విద్య, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను సమీక్షించారు. అర్హులైన గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయడంలో జాప్యం చేయరాదని, అవసరమైన విద్యుత్ కనెక్షన్లు కల్పించాలని అధికారులకు సూచించారు. మారుమూల తండాల్లో రక్షిత తాగునీటి సదుపాయం లేని ప్రాంతాలను గుర్తించి, జల్ జీవన్ మిషన్ కింద అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ముందుగా స్థానిక అధికారులను సంప్రదించాలని, ప్రజావాణి వంటి ఫిర్యాదుల పరిష్కార వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. అక్కడ పరిష్కారం లభించని పక్షంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని వివరించారు. కమిషన్ ఫిర్యాదుల పరిష్కార పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదులు సమర్పించవచ్చన్నారు. గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కమిషన్ విధులు, ఫిర్యాదుల నమోదు ప్రక్రియ, గిరిజనుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గిరిజనుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై.గిరి, జిల్లా అటవీ అధికారి సూరజ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఆర్‌బీఐ జీఎం సుప్రభాత్

ఉద్యమ కెరటం, సిద్దిపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక సమ్మిళితత్వం, సురక్షిత బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జనరల్ మేనేజర్ ఎం.జి.సుప్రభాత్ అన్నారు. సిద్దిపేట ఐటీ టవర్‌లో గురువారం ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు యశ్వంత్ సాయి, కిరణ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బి.హరిబాబు, నాబార్డ్ డీడీఎంలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ జీఎం మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు, వినియోగదారుల హక్కులు, సురక్షిత లావాదేవీలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బి.హరిబాబు మాట్లాడుతూ లీడ్ బ్యాంక్ పథకం లక్ష్యాలు, వివిధ ప్రభుత్వ పథకాలు, బీమా, పెన్షన్ సదుపాయాల గురించి వివరించారు. అర్హులైన ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. నాబార్డ్ డీడీఎం మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద గిడ్డంగులు, శీతల నిల్వ కేంద్రాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, వడ్డీ రాయితీల గురించి వివరించారు. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఒక్కరికీ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు బ్యాంకు అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 55 గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఉద్యమ కెరటం, ఖమ్మం: జిల్లాలో ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. మద్దులపల్లిలో నిర్మిస్తున్న బాలుర, బాలికల హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన మేరకు కార్మికులను పెంచి, వివిధ పనులను సమాంతరంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి దోహదపడే నిర్మాణాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని, ఇంజనీరింగ్ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనుల ప్రతి దశను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం వెంకటగిరిలో అసంపూర్తిగా ఉన్న జీప్లస్-2 భవనాలను పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆ భవనాలను వినియోగించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహశీల్దార్ వినయేంద్ర రెడ్డి, వైద్య శాఖ, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కుంరం సూరు వర్ధంతి పోస్టర్ విడుదల

- జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆత్రం సుగుణకు ఆహ్వానం

ఉద్యమ కెరటం, జైనూర్: ఆదివాసీ కొలాం వీరరత్నం, అమరజీవి కుంరం సూరు 29వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ నిర్వహణ కమిటీ సభ్యులు గురువారం జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈనెల 30న శుక్రవారం జైనూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ ఆదివాసీ కొలాం సమాజ హక్కుల పరిరక్షణ కోసం కుంరం సూరు చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలు ఆదివాసీ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, ఆదివాసీ ప్రజలు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కుంరం సూరుకు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రషీద్, ఉమ్మడి జిల్లా కొలాం సేవా సంఘం అధ్యక్షుడు ఆత్రం బాపురావు, ఉపాధ్యక్షుడు కడప భీమ్ రావు, మార్కెట్ డైరెక్టర్ ఆత్రం భుజంగరావు, సలహాదారు ఆత్రం భీమ్‌రావు, సంస్కృతి కార్యదర్శి కొడప రాజు, సిడం భగ్గు, ఆత్రం లక్ష్మణ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.